ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 1 జూన్ 2025



## తిరుమల కొండ కిటకిట



కృష్ణతేజ సర్కిల్ నుంచి శిలాతోరణం వరకున్న క్యూలో సర్వదర్శన భక్తులు

- 8లో -

# పింఛన్ల పంపిణీలో జిల్లాకు రెండో స్థానం

- 2,45,837మందికి పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), మే 31(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో జిల్లాకు రెండవ స్థానం దక్కింది. 2,60,379 మందికిగాను శనివారం రాత్రి 7గంటలకు 2,45,837మందికి పింఛన్ల కింద రూ.105.22 కోట్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి చెప్పారు. జిల్లాలో ఉదయం 6.30గంటలకే సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి లబ్ధికారులకు పింఛన్లు అందించారు. సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. జూన్ 1 ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు అందించారు. తిరుపతి నగరంలో టీడీపీ నేతలు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, శ్రీధర్‌వర్మ తదితరులతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.



తిరుపతిలో టీడీపీ నాయకులతో కలిసి పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



## బీపీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 31 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో బీపీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్ సైట్లలో ఫలితాలు పొందుపర్చినట్లు సీఈ రాజమాణిక్యం తెలిపారు.

# మోసం చేసి సంపాదించావు

- డబ్బులు పంపకుంటే కేసు పెడతాం
- సైబర్ ఉచ్చుకు చిక్కి రూ.22.5 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

తిరుపతి(నేరవిభాగం), మే 31(ఆంధ్రజ్యోతి): 'నువ్వు మోసం చేసి డబ్బులు సంపాదిస్తున్నావు. మేము అడిగిన డబ్బు పంపకుంటే కేసు పెడతాం' అంటూ గతంలో బియ్యం వ్యాపారం చేసిన 74 ఏళ్ల వెంకటేష్ గుప్తాను సైబర్ నేరగాళ్లు శనివారం బెదిరించారు. తిరుపతి వెస్ట్ ఎస్ఐ అనిల్‌కుమార్ కథనం మేరకు.. తిరుపతి నగరం కొత్తవీధిలోని వెంకటేష్ గుప్తా గతంలో బియ్యం వ్యాపారం చేసేవారు. ప్రస్తుతం వయస్సు మీద పడడంతో ఇంటి వద్దే ఉంటున్నారు. వ్యాపార లావాదేవాలకు సంబంధించి బ్యాంకు అకౌంట్లు ఉన్నాయి. ఈ క్రమంలో ఆయన మొబైల్ ఫోన్‌కు పోలీసు యూనిఫాంలో ఉన్న వాట్సాప్ పిక్‌తో దుండగులు వాట్సాప్ కాల్ చేశారు. 'మీ ఆధార్ నెంబరు, మీ బ్యాంకు అకౌంటు నెంబర్లు మొత్తం మా వద్ద వున్నాయని మీరు బ్యాంకు లావాదేవీల్లో మోసాలు చేసి డబ్బులు సంపాదిస్తున్నారని బెదిరించారు. దీంతో పోలీసులే ఫోను చేస్తున్నారని ఆయన ఆందోళనకు గురయ్యారు. దీంతో వాళ్లు మరింతగా ఒత్తిడి తెచ్చారు. మీ బ్యాంకు అకౌంటు నుంచి మాకు డబ్బులు పంపకుంటే వెంటనే కేసు నమోదు చేస్తామనడంతో ఆయన భయపడి దాదాపు రూ.22.50 లక్షలు సైబర్ నేరగాళ్ల రెండు అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేశారు. తీరా వారితో మాట్లాడడానికి ప్రయత్నించగా వారి నెంబరు పనిచేయక పోవడంతో మోసపోయామని గుర్తించి వెస్ట్ ఎస్ఐ అనిల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



పంటలను పరిశీలిస్తున్న సీనియర్ శాస్త్రవేత్తలు కవిత, తనూజ,విద్యార్థులు

తిరుచానూరు, మే 31(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేమూరు ప్రకృతి వ్యవసాయ రైతు దామ అయ్యప్ప నాయుడు వ్యవసాయ క్షేత్రంలో శనివారం డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్శిటీ బీఎస్సీ చివరి సంవత్సరం విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా జీవామృతాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. పీఎండీఎస్ కిట్లు, దేశీ కూరగాయాలు, విత్తనాలపై అవగాహన కల్పించారు. పీఎండీఎస్ పంటలను హార్వెస్టింగ్, పశువుల మేతగా ఉపయోగిస్తున్న తీరును విద్యార్థులు పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు. సీనియర్ శాస్త్రవేత్తలు తనూజ, కవిత పాల్గొన్నారు.

## చెడు అలవాట్లకు దూరమైతే ఆరోగ్యానికి చేరువ




ర్యాలీగా బయలుదేరిన వైద్యులు, సిబ్బంది.

చంద్రగిరి, మే 31(ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యానికి దగ్గరవ్వాలని రూరల్ హెల్త్ సెంటర్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం చంద్రగిరి ఆర్‌హెచ్‌ఎస్‌లో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈక్రమంలో వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ పొగాకు తాగే వ్యసనానికి బానిస కారాదన్నారు. ధూమపానం వదిలి యోగా, ప్రాణాయామం, ధ్యానం, నడక లాంటివి అలవాటు చేసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. డాక్టర్ మధుసుదన్‌రావు, డాక్టర్ రేవతి, జూనియర్ డాక్టర్లు ప్రణతి, లహరి, హేమిత, లహరిప్రియ, సూపర్‌వైజర్లు, నర్సింగ్ కళాశాలకు చెందిన విజయ భార్గవి, బేగం, టాటాబాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా భక్తాంజనేయస్వామికి పుష్పాభిషేకం



చంద్రగిరి, మే 31(ఆంధ్రజ్యోతి): శ్రీవారిమెట్టు మార్గంలో భక్తాంజనేస్వామికి శనివారం భక్తి శ్రద్ధలతో వైభవంగా పుష్పాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి స్వామిని విశేషంగా అలంకరించారు. సుమారు ఒకటిన్నర టన్నుల పుష్పాలతో స్వామివారికి పుష్పాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పుష్పాలు సమర్పించారు.మధ్యాహ్నం సుమారు 5వేల మందికి అన్నదానం చేశారు.

## పౌరహక్కుల పరిరక్షణకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

రామచంద్రాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): పౌరహక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దారు వెంకటరమణ అన్నారు. చిట్టత్తూరు దళితవాడలో దళితుల పౌరహక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల సద్వినియోగం లాంటి అంశాలను వివరించారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇంటి పట్టాల మంజూరు చేస్తామన్నారు. భూసమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఏఎస్‌ఐ ఈశ్వరయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌పై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి, విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఈఈ వి.గిరి, ఆర్‌ఐ లక్ష్మీనారాయణ, వీఆర్వో వెంకటరమణ పాల్గొన్నారు.

## బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న అభయం

చంద్రగిరి, మే 31(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాల అనంతరం ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవ జరిగింది. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి బంగారు తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు.

## పోలీసు ఆస్పత్రి ప్రారంభం

తిరుపతి(నేరవిభాగం), మే 31(ఆంధ్రజ్యోతి): తిరుపతి బాలాజీ కాలనీలో రూ.8 లక్షలతో ఆధునికీకరించిన పోలీసు యూనిట్ ఆస్పత్రిని శనివారం ఎస్పీ హర్షవర్ధన రాజు ప్రారంభించారు. పోలీసులు ఆరోగ్యంగా ఉన్నపుడే విధుల్లో ఉత్సాహంగా పనిచేస్తారన్నారు. నిరుపయోగంగా ఉన్న ఆస్పత్రిని ఆధునికీకరించి సిబ్బందికి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. 13 టెస్టులు ఇక్కడే చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, శ్రీనివాసరావు, డాక్టర్ మాధురి, డీఎస్పీలు భక్తవత్సలం, శ్రీనివాసరావు, శ్యాంసుందర్, రామకృష్ణమాచారి, రిజర్వు డీఎస్పీలుపాల్గొన్నారు.

## తిరుపతి-విశాఖ వేసవి రైళ్ల పొడిగింపు

తిరుపతి(సెంట్రల్), మే 31(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖపట్నం - తిరుపతి మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను జూలై 31వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. విశాఖలో ప్రత్యేక రైలు(08547) ఈనెల 4వ తేదీ నుంచి ప్రతి బుధవారమూ బయలుదేరి దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట మీదుగా మరుసటి రోజు తిరుపతికి చేరుకుంటుంది. అదే రోజు(గురువారం) ఈ ప్రత్యేక రైలు(08548) తిరుపతిలో బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇలా జూలై 31వరకు రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. చర్లపల్లి-తిరుపతి మధ్య నడుస్తున్న వేసవి ప్రత్యేక రైళ్లను జూన్ 30 వరకు 18 సర్వీసులు పొడిగించినట్లు పేర్కొన్నారు. చర్లపల్లిలో ప్రత్యేక రైలు(07017) ప్రతి ఆది, శుక్రవారాల్లో బయలుదేరుతుందని, అలాగే తిరుపతిలో ప్రత్యేక రైలు(07018) ప్రతి సోమ, శనివారాల్లో రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

## మద్యం మత్తులో యువకుల హల్‌చల్

### అదుపులోకి తీసుకున్న పోలీసులు

భాకరాపేట, మే 31(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వీరంగం చేసిన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.. పోలీసుల కథనం మేరకు చిన్నగొట్టిగల్లు మండలంలోని గొల్లపల్లె, దక్కువాండ్లపల్లె గ్రామాలకు చెందిన ఇద్దరు యువకులు శనివారం రాత్రి మద్యం తాగి భాకరాపేటలో రోడ్డుపై వెళ్తున్న ప్రజలపై బూతులు తిట్టడం, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. 18ఏళ్ల లోపు వయసున్న ఆ యువకులను అదుపులోకి తీసుకున్నారు.

## నేడు భోగ శ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్ర కలశాభిషేకం

తిరుమల, మే31(ఆంధ్రజ్యోతి): శ్రీవారి పంచబేరాలలో ఒకటైన భోగశ్రీనివాసమూర్తికి ఆదివారం ప్రత్యేక సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నారు. శ్రీవారి ఆలయంలో పల్లవరాణి సామవై ప్రతిష్ఠించిన రోజును పురస్కరించుకుని ఈ వేడుక జరుగనుంది. ఈక్రమంలో ఉదయం గరుడాళ్వార్ సన్నిధిలో శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామి, భోగశ్రీనివాసమూర్తి, విష్వక్సేనులవారిని వేంచేపు చేస్తారు. శ్రీవారి మూలమూర్తి ముందు గరుడాళ్వార్ సన్నిధిలో మనవాళ పెరుమాళ్(భోగశ్రీనివాసమూర్తి), ఆయనకు అభిముఖంగా విష్వక్సేనులవారిని ఆశీనులను చేస్తారు. మూలమూర్తిని భోగశ్రీనివాసమూర్తికి కలుపుతూ దారం కట్టి అనుసంధానం చేస్తారు. అనంతరం ప్రత్యేక సహస్ర కలశాభిషేకాన్ని నిర్వహించనున్నారు. అయితే ఆర్జితసేవలన్నీ యథావిధిగా కొనసాగుతాయని టీటీడీ ఒక ప్రకటనలో పేర్కొంది. .

## వేరుశనగ విత్తనాలు సిద్ధం



విత్తన కాయలను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

భాకరాపేట, మే 31(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేయడానికి అవసరమైన వేరుశనగ విత్తన కాయలు సిద్ధం చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ధనలక్ష్మి తెలిపారు. మండలానికి 750 క్వింటాళ్ల విత్తనాలు అవసరమన్నారు. ప్రస్తుతం రంగన్నగారిగడ్డ, చట్టేవారిపాళెం, జంగావాండ్లపల్లె, చిట్టేచర్ల, చిన్నగొట్టిగల్లు రైతు సేవా కేంద్రాలకు 427 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయన్నారు. మిగిలిన కేంద్రాలకు త్వరలో వస్తాయన్నారు. విత్తనాలు వచ్చాక పంపిణీ చేస్తామని ఆమె వివరించారు.

## యోగాతో శారీరక సమతుల్యత



చిన్నగొట్టిగల్లులో జరుగుతున్న యోగా తరగతులు

భాకరాపేట, మే 31(ఆంధ్రజ్యోతి): యోగా శారీరక సమతుల్యత మెరుగుపడుతుందని ఎంపీడీవో గిడ్డయ్య పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా చిన్నగొట్టిగల్లు, భాకరాపేట ఉన్నత పాఠశాలల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ యోగా వలన ఏకాగ్రత పెరుగుతుందని, ఆలోచనా శక్తి పెరిగి పనుల్లో చురుకుతనం ఉంటుందన్నారు. నాడీ వ్యవస్థ ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ముగిసిన ఆర్ట్స్, క్రాఫ్ట్స్ శిబిరం

తిరుచానూరు, మే 31(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో మే 1 నుంచి జరుగుతున్న ఆర్ట్స్ క్రాఫ్ట్స్ వేసవి శిబిరం ముగిసినట్లు ఏవో సుధాకర్ తెలిపారు. ఇందులో 75మంది విద్యార్థులు పాల్గొన్నారు. మట్టి బాణాలు, మట్టి బొమ్మల తయారీ, శాస్త్రీయ, జానపద నృత్యం, చిత్రలేఖనం, పెయింటింగ్‌పై శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను ప్రదర్శించారు. గీత, మాధురి, దివ్య, ప్రసన్న, సత్య, పద్మశ్రీ, అష్మిత, రేషిత, నవ్య, తదితరులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. శిక్షణ ఇచ్చిన బోధకులను సన్మానించారు. సిబ్బంది రేష్మా, లావణ్య పాల్గొన్నారు.

## వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

రామచంద్రాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు వ్యాసరచన, చిత్రలేఖనంపై నైపుణ్యతను పెంపొందించుకోవాలని ఎన్‌సీసీ గ్రూప్ కమాండెంట్ కెప్టెన్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే అన్నారు. శనివారం వెరిటాస్ సైనిక స్కూల్ ఆవరణలో ఎన్‌సీసీ శిక్షణ కార్యక్రమంలో భాగంగా క్యాడెట్లకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పర్యవేక్షకులు పి.సురేష్‌కుమార్, గుణశేఖర్, శ్రీనివాసులు, రాజశేఖర్, ఏఎన్‌వోలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 31 (ఆంధ్రజ్యోతి): తిరువీధులు గోవింద నామ స్మరణతో మార్మోగాయి. స్థానిక భజన మండలి కళాకారులు శనివారం తెల్లవారుజామున నుదుటిపై గోవిందనామం, సంప్రదాయ వస్త్రధారణతో గోవిందరాజ ఆలయం నుంచీ ప్రధాన వీధుల్లో నగర సంకీర్తన కొనసాగింది. కోలాటం, మంగళ వాయిద్యాలతో లయబద్ధంగా కళాకారులు నాట్యం చేస్తూ ముందుకు సాగారు. రాయలసీమ రంగస్థలి అధ్యక్షులు గుండాల గోపీనాథ్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పద్మనాభం, మధు, కన్నప్ప, వాసుదేవరెడ్డి, అరుణ, లీలావతి, పాల్గొన్నారు.

## ఎంచుకున్న వృత్తే దైవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 331 (ఆంధ్రజ్యోతి): ఎంచుకున్న వృత్తినే దైవంగా భావించి ఎంతో మంది విద్యార్థులను ఎస్వీ మ్యూజిక్ కాలేజీ లెక్చరర్ రామచంద్ర తీర్చిదిద్దారని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం పేర్కొన్నారు. ఎస్వీ నాదస్వర, డోలు పాఠశాల డోలు అధ్యాపకులు ఎం.రామచంద్రను ఎస్వీ మ్యూజిక్ కాలేజీ ఆడిటోరియంలో శనివారం సాయంత్రం ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మానించారు. రామచంద్ర దంపతులను రుద్రకోటి సదాశివం తదితరులు గజమాల, శాలువాతో సత్కరించారు.

## లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిట్ 317ఇ చైర్మన్‌గా కృష్ణ ప్రసాద్

తిరుపతి(ఆటోనగర్), మే 31(ఆంధ్రజ్యోతి): లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిట్ 317ఇ సంస్థ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించినట్లు సంస్థ ఎలెక్ట్ గవర్నర్ అశ్వత్ నారాయణ స్వామి నుంచి లేఖ వచ్చినట్లు ఆర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. గతంలో లయన్స్ క్లబ్‌లో వివిధ స్థానాల్లో సేవలందించినందుకు లయన్స్ ఇంటర్నేషనల్ క్యాబినెట్‌లో స్థానం లభించడం ఆనందంగా ఉందన్నారు.

# ఈ నిర్మాణాలు 'వ్యర్థ'మేనా?

**● 15 పంచాయతీల్లో ఏవీ చెత్త సంపద కేంద్రాలు**



గొల్లపల్లెలో మూలకు చేరిన చెత్త సంపద తయారీకేంద్రం

తిరుపతి రూరల్, మే31(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపదను సృష్టించడం ద్వారా గ్రామాభివృద్ధికి బాట వేయాలనే సంకల్పం కొన్ని గ్రామాల్లో నెరవేరడంలేదు. గత టీడీపీ హయాంలో రూ.లక్షలు ఖర్చు చేసి చెత్త సంపద తయారీ కేంద్రాలను నిర్మించింది. ఈక్రమంలోనే తిరుపతి రూరల్ మండలంలో 25 కేంద్రాలను నిర్మించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణ ఊసే మరిచింది. దీంతో ఐదేళ్ల పాటు ఈకేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. వీటిలో కొన్ని వర్షాలకు కొట్టుకుపోయాయి. మరికొన్ని కేంద్రాలు పాడైపోయాయి. ప్రస్తుతం తొమ్మిది మాత్రమే ఉన్నాయి. విభజనానంతరం ఏర్పాటైన కొత్త పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలను నిర్మించలేదు. 15చోట్ల వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెత్త సంపద కేంద్రాలపై ఫోకస్ పెట్టింది. క్రమంతప్పకుండా ఇంటింటా చెత్త సేకరణ ప్రక్రియ జరుగుతోంది. తడిచెత్తద్వారా వర్మికంపోస్టు ఎరువు తయారుచేసి విక్రమిస్తున్నారు. పంచాయతీలకు ఇది ఆదాయవనరుగా మారింది. పొడిచెత్తలోని బాటిళ్లని విక్రయించి ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. మండలంలో అన్ని పంచాయతీల్లో వీటిని ఏర్పాటు చేసి ఆచరణలోకి తెస్తే రైతులకు,పంచాయతీలకు కూడా ఆదాయం సమకూరుతుంది.

### స్థలం కేటాయిస్తే నిర్మిస్తాం

రూరల్‌మండలంలో 15పంచాయతీల్లో సంపద తయారీకేంద్రాల ఏర్పాటుకు స్థలం కోసం తహసీల్దార్‌కి నివేదించాం. స్థలం చూపిన వెంటనే పనులను అంచనా వేని అధికారులకు తెలియజేస్తాం. పాడైపోయిన కేంద్రాల్లో మరమ్మతులు చేపట్టి సత్వరజ తిరిగి వినియోగంలోకి తీసుకొస్తాం.

-ఎంపీడీవో రామచంద్ర

## పేదప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: నాని



లబ్ధిదారుకు పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

రామచంద్రాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శనివారం రామచంద్రాపురం ఎస్టీకాలనీలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పలువురికి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ మండలంలో 5,548మందికి పింఛన్లు అందజేస్తున్నామన్నారు. జూన్ 1 ఆదివారం కావడంతో ముందుగానే అందజేశామన్నారు. వైసీపీ ప్రభుత్వం చాలా మంది అనర్హులకు పింఛన్లను మంజూరు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం అర్హులకు అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ఇందిర, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి, నాయకులు జనార్దన్ చౌదరి, చిన్నబాబు, లీలామోహన్‌నాయుడు, ఉమాపతినాయుడు, కోరా హరిప్రసాద్, నరసింహారెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, మధురెడ్డి పాల్గొన్నారు.

## ట్యాక్సీ డ్రైవర్లకు చలానాల భారం

**● న్యాయం చేయాలని జనసేన వినతి**



ఏవీఎస్వో శైలేంద్రతో మాట్లాడుతున్న జనసేన నాయకులు,

తిరుమల, మే31(ఆంధ్రజ్యోతి): విపరీత చలానాల విధింపుతో ట్యాక్సీ డ్రైవర్లు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తిరుపతి జనసేన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి, తిరుమల ట్యాక్సీ డ్రైవర్లు ఇటీవల ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను కలిసి తమ కష్టాలను ఏకరువు పెట్టారు. ఈక్రమంలో ఆయన సూచన మేరకు జనసేన పార్టీ నగర అధ్యక్షుడు రాజారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ యాదవ్‌లు ట్యాక్సీ డ్రైవర్లతో కలిసి శనివారం టీటీడీ 3వ సెక్టార్ ఏవీఎస్వో శైలేంద్రను కలిశారు. డ్రైవర్లు, యజమానులకు ట్రాఫిక్ ఆంక్షలు, జరిమానాల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్‌ను కూడా కలిశారు. నిబంధనలను పాటిస్తూ అవసరమైన పత్రాలు ఉంచుకోవాలని, సమస్యలను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా సీఐ వారికి చెప్పారు.

## అలరించిన అన్నమయ్య సంగీత నృత్యోత్సవం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 31 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య సంగీత నృత్యోత్సవం ఆకట్టుకుంది. అన్నమాచార్య జయంతి సందర్భంగా జై జవాన్ జై కిసాన్ జై కళాకర్ సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. మహతి కళా క్షేత్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో చిన్నారులు చక్కని నృత్యాభినయాన్ని ప్రదర్శించారు. పలువురు కళాకారులు ఆలపించిన జానపద, సంప్రదాయ, భక్తిపాటలు, నృత్య ప్రదర్శనలు అలరించాయి. శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు జరిగిగిన ఈ ప్రదర్శన డెవోషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో చోటు సంపాదించుకుంది. సంస్థ వ్యవస్థాపకులు వెంకటరమణరావు నేతృత్వంలో కళాకారులు, వారి గురువులను సన్మానించారు. అంతకు ముందు జరిగిన సభలో టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, బుల్లెట్ రమణ, రంగస్థల కళాకారుల వేదిక అధ్యక్షుడు మునిరత్నంలు మాట్లాడారు.

## అధికారుల సేవలు అమూల్యం



లక్ష్మీనరసయ్యను సన్మానిస్తున్న సీఎండీ సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్), మే 31 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం అభివృద్ధికి అధికారులు అందిస్తున్న సేవలు అమూల్యమని సంస్థ సీఎండీ కె.సంతోషరావు అన్నారు. సదరన్ డిస్కం కార్యాలయంలో శనివారం ఫైనాన్స్ డైరెక్టర్, సీజీఎం వై.లక్ష్మీనరసయ్య, ఈఈ బి.జనార్దన్, ఏఈ శివప్రసాద్ ఉద్యోగ విరమణ చేశారు. ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సన్మాన సభలో సీఎండీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సంస్థకు మూలస్తంభం లాంటి ఆర్థిక శాఖలో లక్ష్మీనరసయ్య ఉత్తమ సేవలందించారన్నారు. మాజీ సీఎండీ పి.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అంకితభావంతో పని చేసే ఉద్యోగుల్లో లక్ష్మీనరసయ్య ఒకరని అన్నారు. డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, ఎస్పీఎంవీవీ మాజీ వైస్ ఛాన్సలర్ దుర్గాభవానీ, ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు పాల్గొని లక్ష్మీనరసయ్య సేవలను కొనియాడారు, అనంతరం లక్ష్మీనరసయ్యను ఘనంగా సన్మానించారు.

## ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

తిరుపతి (నేరవిభాగం), మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ శెట్టిపల్లె రైల్వే గేటు వద్ద ద్విచక్ర వాహనంలో వెళుతూ శుక్రవారం కింద పడి బీటీఆర్ కాలనీకి చెందిన రవికుమార్ గాయపడ్డారు. తలకు బలమైన గాయం కావడంతో రుయా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఇతడి అన్న వెంకటాద్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐనాగార్జునరెడ్డి కేసు నమోదు చేశారు.

# కిడ్నాప్ ఘటనలో కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం) మే 31(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన కార్లు కొని.. అమ్మే వ్యక్తిని తిరుపతిలో కిడ్నాప్ చేసి వదలిపెట్టిన ఘటనపై బాధితుడు శనివారం తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. మదనపల్లె ఇంద్రానగర్ నివాసి షేక్ షాకిర్ కొంత కాలంగా కార్లు కొని.. అమ్మేవారు. ఈ ఏడాది ఏప్రిల్ 18న బెంగళూరు నగరం కేఆర్‌పురం ప్రాంతానికి చెందిన సయ్యద్ సాదిర్ నుంచి కారు కొన్నారు. ఇదే కారును మళ్లీ బెంగుళూరులోని శ్రీనప్పకు 3.90 లక్షలకు విక్రయించారు. దీనికి గాను అప్పటిలో కొనుగోలు దారుడు రూ.20 వేలు బాకీ ఉంది. దీనిపై కొద్ది రోజులుగా షాకిర్ ఫోన్ చేసి డబ్బులు అడిగేవారు. ఈ క్రమంలో శనివారం తిరుపతి రూరల్ మండలం తనపల్లి క్రాస్‌లోని ఓ లాడ్జీ వద్దకు వచ్చిన సాదీర్, అతని స్నేహితుడు సంపత్ లోచన్, మరో వ్యక్తి.. దీనిపై కింద మాట్లాడుదాం అని షాకిర్‌ను తీసుకొచ్చారు. అక్కడ వున్న అల్లాభక్షతో కలసి కిడ్నాప్ చేసి కారులో తీసుకెళ్లారు. ఓ పెట్రోలు బంకు వద్దకు తీసుకెళ్ళి అతన్ని చిత్ర హింసలకు గురిచేసి అతని వద్ద నుంచి బలవంతంగా మొబైల్ ఫోన్ లాక్కొన్నారు. ఫోన్‌లో పింగర్ ప్రింట్ తీసుకుని ఓపన్ చేసి అతని ఖాతాలో వున్న డబ్బులు చూశారు. అనంతరం తనపల్లి క్రాస్ వద్ద వదలి కొట్టి భయపెట్టి రేణిగుంట వైపు వెళ్ళి పోయారు. జరిగిన ఘటనపై బాధితుడు షేక్ షాకిర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేశారు. కిడ్నాప్ చేసిన ఘటనలో నలుగురు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## డీఐఈవోకు అధ్యాపకుల సత్కారం



తిరుపతి(విద్య), మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి (డీఐఈవో) జి.రాజశేఖర్‌రెడ్డికి ఏపీ జూనియర్ కళాశాలల ఉద్యోగుల ఫెడరేషన్‌కు చెందిన అధ్యాపకులు శుభాకాంక్షలు తెలియజేశారు. డీఐఈవోగా నియమితులైన సందర్భంగా ఫెడరేషన్ నాయకులు, సభ్యులు శనివారం కలిసి సన్మానించారు. ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జలగం రామాంజులు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, సంఘం నాయకులు నూకల సురేష్, శ్రీనివాస్, శంకర్‌రెడ్డిలు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

## నేడు స్థానికులకు శ్రీవారి దర్శన టోకెన్ల జారీ

తిరుమల, మే31(ఆంధ్రజ్యోతి): స్థానికులకు జూన్ 3న కల్పించే శ్రీవారి దర్శనానికి సంబంధించిన టోకెన్లను టీటీడీ ఆదివారం జారీ చేయనుంది. తిరుపతి స్థానికులకు మహతి ఆడిటోరియంలోని కౌంటర్లలోను, తిరుమల స్థానికులకు బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 5 గంటల నుంచి టోకెన్లను జారీ చేయనున్నారు. తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాల స్థానికులు ఆధార్‌కార్డు చూపించి టోకెన్లు పొందవచ్చు.

## కాలినడకన తిరుమలకు కలెక్టర్



చంద్రగిరి, మే 31(ఆంధ్ర జ్యోతి): శ్రీవారి దర్శనార్థం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం సాయంత్రం శ్రీవారి మెట్టు మార్గన తిరుమలకు చేరుకున్నారు. ఆదివారం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

## పింఛన్ల పంపిణీ

తిరుపతి, మే31(ఆంధ్రజ్యోతి) : నగరంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య తదితరులు పాల్గొని పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు.

## కోడి బొచ్చుకథకు ముగింపు పలకండి

**● కమిషనర్‌కు కూటమి నేతల వినతి**



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కూటమి నేతలు ఆర్సీ మునికృష్ణ, ఎస్కే బాబులు

తిరుపతి, మే 31 (ఆంధ్రజ్యోతి): కోడి బొచ్చు మాఫియాతో వైసీపీ ప్రభుత్వం తిరుపతిని భ్రష్టు పట్టించిందని, ఎలాంటి విమర్శలు లేకుండా వివాదానికి ముగింపు పలికేందుకు తగు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్ ఎస్కే బాబు చెప్పారు. 'కోడిబొచ్చుకథలో కొత్త ట్విస్ట్' పేరుతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై వీరు స్పందించి కమిషనర్ మౌర్యకు వినతి పత్రం అందజేశారు. చికెన్ వేస్ట్‌ను టన్ను రూ.500కు ఇతర నగరాలలో కొనుగోలు చేస్తుంటే ఇక్కడ మాత్రం రూ.100, రూ250కే చేజిక్కించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. రూ500కు తక్కువైతే కేటాయించవద్దని సూచించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ...అనుకున్నంత ధర లేకపోతే నెగోషియేట్ చేస్తామని, ఒకే టెండరు ఉంటే రద్దు చేస్తామని చెప్పినట్టు తెలిసింది. ఒకవేళ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రెండరింగ్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు.

# తిరుపతి

## మంగళం పీహెచ్‌సీలో యోగాంధ్ర

తిరుపతి అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. శిక్షకులు జయసుధ, ప్రవీణ్ ద్వారా యోగాసనాలతో పాటు ఆరోగ్య సమస్యలపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జయంతి, డాక్టర్ విజయచంద్రిక, పి.శివజ్యోతి, డాక్టర్ భానురేఖ, ఆరోగ్య విస్తరణ అధికారి మురళి, తారకనాథ్, దామోదరం, ప్రసాద్, ఏఎన్ఎంలు, నర్సులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

**పొగాకు వ్యతిరేక ర్యాలీ :** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా శనివారం మంగళం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జయంతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పొగాకు, వాటి ఉత్పత్తులు వాకడం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ శివజ్యోతి, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏకాగ్రత అలవరుచుకోండి


మాట్లాడుతున్న డీపీటీవో వెంకటరావు

తిరుపతి(ఆర్టీసీ), మే 31(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఏకాగ్రత అలవాటు చేసుకోవాలని ప్రజా రవాణాధికారి వెంకటరావు ఆర్టీసీ సిబ్బందిని ఆదేశించారు. రెండు రోజులపాటు ఆయన మంగళం డిపోలో తనిఖీలు నిర్వహించారు. లోటుపాట్లు, సమస్యలను గుర్తించారు. తక్షణం చేపట్టాల్సిన చర్యలపై సిబ్బంది పలు సూచనలు చేశారు. శనివారం గేట్‌మీటింగ్ నిర్వహించి ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ బస్సు నడిపే సమయంలో దృష్టి డ్రైవింగ్‌పై ఉండాలని, మొబైల్ వాడకూడదని, చెడు వ్యసనాలు మానుకోవాలని, మద్యం తాగి డ్యూటీకి రాకూడదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఖాళీ సమయంలో కాసేపు యోగా పాటిస్తే ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ భాస్కర్, పద్మావతి పాల్గొన్నారు.

## మురుగన్ సేవలో ఆర్ఎస్‌పీయూ ఎస్పీ

తిరుత్తణి, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి శేషాచలం అటవీ శాఖ రెడ్ శాండిల్ స్మగ్లింగ్ ప్రివెన్షన్ యూనిట్ (ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక విభాగం) ఎస్పీ పి.శ్రీనివాస్ శనివారం ఉదయం తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో మురుగన్ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మురుగన్‌కు ప్రత్యేక అభిషేకం చేయించారు. దర్శనానంతరం ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు. ఆయన వెంట ఇన్‌స్పెక్టర్లు సాయిగిరిధర్, సురేష్‌కుమార్, ఏసీఎఫ్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


సినీ నటుడు ఘట్టమనేని కృష్ణ జయంతిని పురస్కరించుకుని ఏ1 క్యాటరింగ్ మస్తాన్, కృష్ణ మహేష్‌బాబు అభిమానులు కలిసి తిరుపతి రుయా ఆస్పత్రి వద్ద అన్నదానం చేశారు

## ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్‌కు సన్మానం

తిరుపతి(వైద్యం), మే 31(ఆంధ్రజ్యోతి): ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్‌గా ఎన్నికైన డాక్టర్ డి.శ్రీహరిరావును స్విమ్స్‌లో డైరెక్టర్ ఆర్వీకుమార్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఆర్వీకుమార్ మాట్లాడుతూ డాక్టర్ శ్రీహరిరావు గతంలో కొంతకాలం స్విమ్స్‌లో పనిచేసి, ఇక్కడి రోగులకు సేవలందించారన్నారు. కొవిడ్ సమయంలోనూ పలు సేవలందించారన్నారు. ఎంఎస్ డాక్టర్ రామ్, ఆర్ఎంవో కోటిరెడ్డి పాల్గొన్నారు.

## ట్రావెల్స్ యజమాని ఆత్మహత్య


మృతి చెందిన రమేష్

తిరుపతి(నేరవిభాగం) మే 31(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన ఒక ట్రావెల్స్ యజ మాని ఆత్మహత్య చేసుకు న్నాడు. అలిపిరి ఎస్ఐ లోకేష్ బాబు వివరాల మేరకు... అరుణోదయనగర్‌కు చెందిన రమేష్(43) కొంతకాలంగా ట్రావెల్స్ నడుపుతున్నాడు. మద్యానికి అలవాటుపడి స్నేహితులతో కలసి డబ్బు దుబారా చేసేవాడు. దీనికితోడు మానసిక సమస్యలు ఎదురుకావడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సుమతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ లోకేశ్‌బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

## గ్రీవెన్స్ కో-ఆర్డినేటర్‌గా నిసార్


రిజిస్ట్రార్ భూపతి నాయుడు నుంచి నియామక ఉత్తర్వులు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ నిసార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 31 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ గ్రీవెన్స్ సెల్ కో-ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ నిసార్ అహమ్మద్ నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. నిసార్ అహమ్మద్ 2007లో వర్సిటీ ఉర్దూ విభాగంలో అధ్యాపకులుగా చేరారు. ప్రాచీన ఉర్దూ గద్య సాహిత్యాంశంపై బోధన, పరిశోధనలు చేపట్టారు. అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించారు. 20 పుస్తకాలకు సంపాదకులుగా, సహ సంపాదకులుగా వ్యవహరించారు. రెండు పుస్తకాలు రాశారు. ఉత్తమ పరిశోధన అవార్డు-2015, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక అవార్డు- 2015 పొందారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్‌గా పనిచేశారు. నోడల్ ఆఫీసరుగా సేవలందించారు. ఈ నేపథ్యంలో గ్రీవెన్స్ కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

## పొగాకు రహిత సమాజానికి కృషిచేద్దాం


వైద్య సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

తిరుపతి(వైద్యం), మే 31(ఆంధ్రజ్యోతి): పొగాకు రహిత సమాజాన్ని సాధించేందుకు కృషి చేద్దామని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులైన బీడీ, సిగరెట్, గుట్కా వంటి ఉత్పత్తులు వాడటం వల్ల ఎంతో మంది జీవితాలను కోల్పోతున్నారన్నారు. అనంతరం పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దామని వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో శ్రీనివాసులరెడ్డి, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథి రెడ్డి, డీపీఎంవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

**పొగాతో ప్రాణాంతక వ్యాధులు:** పొగాకు ఉత్పత్తులను ఏ రూపంలో తీసుకున్నా ప్రాణాంతక వ్యాధులకు దారి తీస్తుందని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. స్విమ్స్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఫ్యాషన్ కోసం పొగాకు ఉత్పత్తులైన బీడీ, సిగరెట్ వంటి వాటిని తీసుకోవడం వల్ల భవిష్యత్తులో ఊపిరితిత్తులు, గుండె జబ్బులు, పక్షవాతం, రక్తప్రసరణ ఆగిపోవడం వంటి సమస్యలతోపాటు పలు రకాల క్యాన్సర్లకు కారణమవుతుందన్నారు. పొగాకు ఉత్పత్తులను వాడటం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఏటా 80 లక్షల మంది మృతిచెందుతున్నారని తెలిపారు. అనంతరం పొగాకు ఉత్పత్తుల రకాలు, వాటి వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు, అనర్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మెడిసిన్ విభాగాధిపతి అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, వైద్యాధికారులు హరికృష్ణ పాల్గొన్నారు.

## సైన్యంలో ఉద్యోగావకాశాలపై అవగాహన

తిరుపతిరూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ కళాశాలలో ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో సైన్యంలో పశువైద్య పట్టభద్రులకు ఉన్న ఉద్యోగావకాశాలపై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన 2(ఏ)ఆర్అండ్‌వీ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అనూప్ మీనన్ అవగాహన కల్పించారు. అంతకుముందు ఆపరేషన్ సిందూర్‌లో మృతిచెందిన సైన్యాధికారులకు నివాళి అర్పించారు. ఎన్‌సీసీలో ప్రతిభచాటిన విద్యార్థులకు కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ వి.జగపతి రామయ్య, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి డాక్టర్ సుధీర్ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

## టీటీడీ చైర్మన్‌ను కలిసిన జేబీ



తిరుపతి, మే31 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును టీడీపీ సీనియర్ నేత, క్లస్టర్ ఇన్‌చార్జి జేబీ శ్రీనివాస్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమలలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారంపై ఈ సందర్భంగా జేబీ చర్చించినట్టు తెలిసింది. భక్తులకు మెరుగైన సేవలు అందుతున్నాయని, అయినా వైసీపీ కుట్ర రాజకీయాలకు తెరలేపుతోందని అన్నారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్‌ను శాలువాతో సత్కరించారు.

## 4న చంద్రగిరి కోటలో యోగాంధ్ర

తిరుపతి(కలెక్టరేట్), మే 31(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కోట వద్ద ఈనెల 4వ తేదీన యోగాంధ్ర నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు సంబంధించి నిర్వహించే ఈ కార్యక్రమంలో పెద్దయెత్తున ప్రజలు హాజరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో జేసీ శుభం బన్సల్, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, పర్యాటక శాఖ ఆర్డీ రమణప్రసాద్, జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీయూలో డీఎస్టీ ప్రతినిధుల బృందం పర్యటన


ఎస్వీయూ అధికారులతో సమావేశమైన డీఎస్టీ ప్రతినిధుల బృందం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 31 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్టీ) ప్రతినిధుల బృందం పర్యటించింది. మే 31, జూన్ 1 తేదీల్లో యూనివర్సిటీలో డీఎస్టీ సౌజన్యంతో నిర్వహిస్తున్న ప్రాజెక్టులను ఈ బృందంలోని నిపుణులు మూల్యాంకనం చేస్తున్నారు. తొలుత ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడితో సమావేశమయ్యారు. ఈ బృందానికి ఢిల్లీ ఎయిమ్స్ రూమటాలజీ డాక్టర్ ఉమాకుమార్ నేతృత్వం వహిస్తున్నారు. డాక్టర్ ఉమేష్‌కుమార్‌శర్మ, డాక్టర్ ఫణికుమార్, తదితరులు ఈ బృందంలో ఉన్నారు. స్థానికంగా జువాలజీ ప్రొఫెసర్ కిషోర్ సమన్వయం చేస్తున్నారు.



## 9న అప్రెంటిస్‌షిప్ మేళా

తిరుపతి(కలెక్టరేట్), మే 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు జిల్లాలోని పరిశ్రమల్లో అప్రెంటిస్‌షిప్ కల్పించేందుకు ఈనెల 9న ప్రైమినిస్టర్ నేషన్ అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ తిరుపతి ప్రిన్సిపాల్ లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని స్కిల్ ఇండియా మేకిన్ ఇండియా పిలుపులో భాగంగా తిరుపతి ప్రభుత్వ ఐటీఐలో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐటీఐ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9441647174ను సంప్రదించాలని కోరారు.

## టాస్క్‌ఫోర్సు ఎఫ్‌బీవోకు వీడ్కోలు

మంగళం,మే31(ఆంధ్రజ్యోతి):టాస్క్‌ఫోర్సులో బీట్‌ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ శనివారం ఉద్యోగ విరమణ పొందిన సి.కోదండన్‌కు టాస్క్‌ఫోర్సు అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. శాలువా కప్పి, జ్ఞాపిక అందజేశారు. ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ కోదండన్ టాస్క్‌ఫోర్సు ప్రారంభం నుంచి ఇక్కడే విధులు నిర్వహించారన్నారు. ఏసీఎఫ్ శ్రీనివాస్, సీఐ సురేష్‌కుమార్, అడ్మిన్ ఆఫీసర్ పాపారావు, ఏఏవో లోకనాథం, ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్, ఎఫ్ఆర్వోలు మురళీకృష్ణ, ప్రేమ్ పాల్గొన్నారు.


పోలీసు అధికారులను అభినందిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

## శేష జీవితం హాయిగా గడపాలి

### పోలీసుల ఉద్యోగ విరమణ సమావేశంలో ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), మే 31(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజా సేవలో గడిపిన పోలీసులు ఉద్యోగ విరమణ తర్వాత ప్రశాంతంగా గడపాలని ఎస్పీ హర్షవర్ధన రాజు అన్నారు. జిల్లాలోని వివిధ స్టేషన్లలో పనిచేస్తూ శనివారం ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లకు కచ్చపి ఆడిటోరియంలో అభినందన సభ నిర్వహించారు. వీరందరికీ జిల్లా పోలీసు శాఖ తరఫున శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ ఒత్తిడికి దూరంగా, కుటుంబ సభ్యులతో హాయిగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, వెంకట్రావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.



## తిరుమల పవిత్రతకు భంగం కల్గించే కుట్ర : టీడీపీ


శ్రీవారి చిత్రపటం చూపుతున్న డిప్యూటీ మేయర్ మునికృష్ణ, టీడీపీ నేతలు

తిరుపతి(ఆటోనగర్), మే31 (ఆంధ్రజ్యోతి): తిరుమల పవిత్రతకు భంగం కల్గించే విధంగా వైసీపీ నాయకులు కుట్ర పన్నుతున్నారని తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నేత ఊట్ల సురేంద్ర నాయుడు ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు మాట్లాడుతూ టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి వైసీపీ నాయకులు పనికట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తిరుమల క్యూలో టీటీడీ చైర్మన్, ఈవో, జేఈవో డౌన్‌డౌన్ అని కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన బదిలి అచ్చారావు నినాదాలు చేయడం వల్ల భక్తుల్లో అభద్రతా భావం ఏర్పడిందన్నారు. ఆయన వైసీపీ ప్రభుత్వంలో ఒక ఆలయానికి చైర్మన్‌గా ఉన్నారని తెలిపారు. తిరుమలలో జరిగే ప్రతి చిన్న విషయాన్నీ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సోషల్ మీడియాలో పనిగట్టుకుని ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. శ్రీవారితో రాజకీయాలు చేసిన వారు ఎదిగిన దాఖలాలు లేవన్నారు. శ్రీవారి భక్తుల మనోభావాలకు భంగం కల్గించే విధంగా సోషల్ మీడియాలో ట్రోల్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కరాటే చంద్ర, గంజి సుధాకర్‌రెడ్డి, శ్రీరాములు, విశ్వనాథం, ధనంజయులు పాల్గొన్నారు.

## వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ



తిరుపతి(జీవకోన), మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 4వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి శనివారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. తప్పుడు కేసులు పెట్టి ప్రతిపక్ష నాయకులను జైల్లో పెట్టడమే ధ్యేయంగా పనిచేస్తోందని విమర్శించారు. దీనికి నిరసనగా 4వ తేదీన తిరుపతిలో ర్యాలీ నిర్వహించనున్నామని చెప్పారు.మేయర్ డాక్టర్ శిరీష, నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్, టౌన్‌బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, నగర అధ్యక్షుడు మల్లం రవి చంద్రారెడ్డి, నల్లాని బాబు, ఉదయ్ వంశీ, వాసుదేవయాదవ్, తలారి రాజేంద్ర, దినేష్‌రాయల్, అనిల్ విడగొట్టి రమణ, అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

## ముగిసిన వేసవి శిక్షణ

తిరుపతి అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): యశోదనగర్‌లోని వేమనవిజ్ఞాన కేంద్రంలో నెల రోజులుగా కొనసాగిన వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో పిల్లలు మొబైల్ మాయాజాలంలో పడకుండా ఆటపాటలతో మానసిక, శారీరక, ఒత్తిడిని తట్టుకుని, కష్టంగా కాకుండా ఇష్టంగా చదివేలా శిక్షకులు బోధించారు. ఆటలు, పాటలు, డ్యాన్సులు, నీతికథలతో ఉల్లాసంగా ఉత్సాహంగా సమ్మర్ క్యాంపు పరిసమాప్తమైనట్లు మల్లారపు నాగార్జున తెలిపారు.

## ఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ సీజీఎంగా రామమోహన్‌రావు

తిరుపతి(ఆటోనగర్), మే 31(ఆంధ్రజ్యోతి) : ఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ సీజీఎంగా కె.రామమోహన్‌రావును నియమిస్తూ శనివారం ఆ సంస్థ సీఎండీ కె.సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ స్థానంలో విధులు నిర్వహిస్తున్న వై.లక్ష్మీనరసయ్య ఉద్యోగ విరమణ చేయడంతో భర్తీ చేశారు. గతంలో రామమోహన్‌రావు కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజరుగా విధులు నిర్వహించేవారు. ఆయనకు సీజీఎంగా పదోన్నతి కల్పించారు.








## అమ్మవారికి బంగారు కాసులమాల



డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్‌కు బంగారు కాసుల మాల అందజేస్తున్న దాత కుమార్

పద్మావతి అమ్మవారికి శనివారం బెంగళూరుకు చెందిన కుమార్ 110 గ్రాముల బంగారు కాసుల మాలను కానుకగా అందజేశారు. దీనిని డిప్యూటీ ఈవో హరీందర్ నాథ్ స్వీకరించారు. దాతకు దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాస్కర్‌నాయుడు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

● సంగీత, నృత్య, నాదస్వరం కోర్సుల్లో చేరికకు

## దరఖాస్తుల ఆహ్వానం

ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, నాదస్వరం, డోలు పాఠశాలలో 2025-26విద్యా సంవత్సరానికి పలు కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీటీడీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. గాత్రం, వీణ, వేణువు, వయోలిన్, నాదస్వరం, డోలు, భరతనాట్యం, కూచిపూడి, నృత్యం, హరికథ, మృదంగం, ఘటం విభాగాల్లో ఫుల్‌టైమ్, విశారద(డిప్లొమా), ప్రవీణ(అడ్వాన్సు డిప్లొమా) కోర్సులున్నాయని పేర్కొంది. నాదస్వరం, డోలు పాఠశాలలో ఫుల్‌టైమ్ సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులున్నాయని, ఈనెల 27వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించింది. ఇతర ప్రాంతాల విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంటుందని వివరించింది. ఆసక్తిగల అభ్యర్థులు కళాశాల కార్యాలయ పనివేళల్లో ఈవో, టీటీడీ పేరుతో రూ.50డీడీ తీసి దరఖాస్తు పొందాలని, రెగ్యులర్ కోర్సులకు 8వ తరగతి ఉత్తీర్ణత, సాయంత్రం కోర్సులకు 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపింది. మరిన్ని వివరాలకు 9440793205, 9848374408లను సంప్రదించాలని కోరింది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

## సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి ప్యార్క్‌లో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**గురువారం హుండీ ఆదాయం: రూ.3.42 కోట్లు**

**శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,721**

**తలనీలాలు సమర్పించినవారు: 36,011**





తిరుపతిలోని రేషన్ దుకాణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సివిల్ సప్లయిస్ డీటీ సురేంద్ర

ఎండీయూ వాహనం వచ్చే రోజుకోసం పని మానుకుని ఎదురు చూడాల్సిన పనిలేదు. పట్టణాల్లో వీధి చివరన.. రోడ్డు పక్కన క్యూలో నిలబడి రేషన్ తీసుకోవాల్సిన అవసరం ఉండదు. ఇక నుంచి తొలి 15 రోజుల్లో.. మనకు వీలున్నప్పుడు వెళ్లి సరుకులు తీసుకోవచ్చు. జూన్ నుంచీ పాత పద్ధతిలో రేషన్ పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

# నేటి నుంచి షాపుల్లోనే రేషన్

● దివ్యాంగులు, వృద్ధులకు ఇళ్ల వద్దకే

● పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

జిల్లాలోని 1457 చౌక ధరల దుకాణాల్లో పాత పద్ధతిలోనే ఆదివారం నుంచి కార్డు దారులకు సరుకులు అందించనున్నారు. ఈ మేరకు పౌరసరఫరాలు, తూనికలు, కొలతలు, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. మండల స్థాయి నిల్వ కేంద్రాల నుంచి జూన్ నెల కోటాను సంబంధించిన బియ్యం, చక్కెర, కంది పప్పు నిల్వలను రేషన్ దుకాణాలకు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వాహనాల వ్యవస్థను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రేషన్ షాపుల్లో డీలర్లు ఈ-పోస్, తూకం మిషన్లు సిద్ధం చేసుకున్నారు. ధరల పట్టిక, నిల్వ వివరాలు, రేషన్ షాపు నెంబరు ప్రదర్శించాలని ఇప్పటికే డీఎస్‌వో శేషాచలం రాజు డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. దుకాణాలు శుభ్రంగా ఉంచుకోవాలని, జూన్ 1న పూలతో అలంకరించాలని ప్రజాప్రతినిధులను, వృద్ధులను ప్రారంభ కార్యక్రమానికి ఆహ్వానించాలని అధికారులు పేర్కొన్నారు. ఇక, రేషాపుల్లో ఏర్పాట్లపై అధికారులు తనిఖీ చేస్తున్నారు. తూకం మిషన్లు పనిచేయని చోట తక్షణం కొత్తవి కొనుగోలు చేసి ఏర్పాటు చేయాలన్నారు. ఇక తాగు నీరు, కూర్చోవడానికి బెంచీలు లేదా కుర్చీలు ఏర్పాటు చేయనున్నారు. అవసరమైతే ప్రతి రేషన్ షాపులో రెండు ఫ్యాన్ల ఏర్పాటుకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**వీళ్లకు.. ఇళ్ల వద్దకు**

65 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికి తీసుకెళ్లి సరుకులు ఇవ్వనున్నారు. వీరందరినీ వాట్సాప్ గ్రూపుగా ఏర్పాటు చేసి సమాచారం ఇవ్వాలి. వీరికి 5వ తేది వరకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటి వద్దకు సరుకులు అందించేలా ఏర్పాట్లు చేయాలి.

**రేషన్ షాపుల పనివేళలు**

ప్రతి నెలా 1 నుంచి 15వ తేది వరకు సరుకులు ఇవ్వాలి. ఈ రోజుల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు.. సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపులు తెరచి ఉంచాలి. ఏ చౌక ధర దుకాణం నుంచైనా వారికి అవసరమైన సరుకులు పొందవచ్చును.





అలిపిరి చెక్‌పాయింట్‌లో కార్ల బారులు.. క్యూలో భక్తులతో మాట్లాడుతున్న అదనపు ఈవో వెంకయ్య

● కొండపై సమ్మర్ ఎఫెక్ట్

# కిటకిటలాడుతున్న తిరుమల

తిరుమల, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలువులు చివరిదశలో ఉండటంతో పాటు వారాంతం కావడంతో శుక్రవారం ఉదయం నుంచే తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. ఈక్రమంలో తిరుమల క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరి పార్క్‌లోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. శుక్రవారం తరహాలోనే శనివారం కూడా క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు సర్వదర్శన భక్తుల క్యూ వ్యాపించింది. వీరికి దాదాపు 16 గంటల తర్వాత దర్శనం లభిస్తోంది. టైంస్లాట్ టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకూ 3 గంటల దర్శన సమయం పడుతోంది. పెరిగిన రద్దీ నేపథ్యంలో శ్రీవారి ఆలయం, మాడవీధులు, అన్నప్రసాదకేంద్రం, వరాహస్వామి విశ్రాంతి గృహాల సర్కిల్, రాంభగీచా, లేపాక్షి కూడళ్లు, బస్టాండ్, యాత్రికుల వసతి సముదాయాలు, కల్యాణకట్టలు, లడ్డూకేంద్రం, ఎంబీసీ, ఎస్వీ గెస్ట్‌హౌస్ వంటి ప్రాంతాల్లో యాత్రికులు కిక్కిరిసిపోయారు.



జేఈవో ఆఫీసు నుంచి నారాయణ గిరి గెస్ట్‌హౌస్ దారిలో..

**బారులు తీరుతున్న కార్లు**

కొవిడ్ తర్వాత తిరుమలకు పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు కంటే సొంతవాహనాల్లో ఎక్కువ మంది భక్తులు వస్తున్నారు. దీంతో తిరుమలలో కార్లు కిక్కిరిసిపోతున్నాయి. శనివారం కూడా అలిపిరి చెక్‌పాయింట్ వాహనాలతో రద్దీగా మారింది. గరుడసర్కిల్ ఆర్చ్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వీఐపీ, సర్వీసు లైన్లతో పాటు ద్విచక్రవాహనాలను అనుమతించే మార్గంలోనూ కార్లను అనుమతించారు. ఇక, తిరుమలలోనూ పార్కింగ్ ప్రాంతాలు నిండిపోవడంతో రోడ్లపైనే భక్తులు వాహనాలను పెట్టి దర్శనానికి వెళ్లిపోతున్నారు. దీంతో తిరుమలలో ట్రాఫిక్ సమస్య నెలకొంది.



అన్నదానం కాంప్లెక్స్ వద్ద భక్తుల రద్దీ

ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్‌ల నుంచి

# 29 పోస్టులు ఔట్

● ఇతర జిల్లాలకు 8 బోధన.. 21 బోధనేతర సిబ్బంది బదిలీ ● బయటి నుంచీ 5 పోస్టుల రాక

● జిల్లాలోనే ఏడు సర్దుబాటు

తిరుపతి, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు 8 టీచింగ్, 21 నాన్ టీచింగ్ పోస్టులు కోల్పోయాయి. ఈ 29 పోస్టులను ప్రభుత్వం ఇతర జిల్లాలకు బదిలీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2008లో పాక్షిక పోస్టులతో మంజూరైన.. 2014-15లో పోస్టులే లేకుండా ఏర్పాటైన పాలిటెక్నిక్‌లలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు సరిపడా లేక నిర్వహణ కష్టంగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పాత పాలిటెక్నిక్‌ల నుంచీ కొన్ని పోస్టులను అవసరమైన చోట్లకు ప్రభుత్వం బదిలీ చేసింది. అందులో భాగంగా టీచింగ్ పోస్టులలో.. తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్ నుంచీ తాడిపత్రికి.. పుత్తూరు మండలం పిళ్యారిపట్టు పాలిటెక్నిక్ నుంచీ నెల్లూరుకు, కడప జిల్లా సింహాద్రిపురానికి ఒక్కోటి చొప్పున.. గూడూరు పాలిటెక్నిక్ నుంచి ఈతముక్కల బాలికల పాలిటెక్నిక్‌కు, నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు ఒక్కోటి వంతున పోస్టులు బదిలీ అయ్యాయి. పలమనేరు బాలికల పాలిటెక్నిక్ నుంచీ కళ్యాణదుర్గానికి, మదనపల్లె మోడల్ నుంచి కళ్యాణదుర్గానికి, గుంటూరు మైనారిటీ పాలిటెక్నిక్‌కు ఒకటి చొప్పున మూడు పోస్టులు బదిలీ అయ్యాయి. ఇక నాన్ టీచింగ్ పోస్టుల విషయానికొస్తే గూడూరు సిరామిక్ టెక్నాలజీ సంస్థ నుంచీ తొమ్మిది, పలమనేరు బాలికల పాలిటెక్నిక్ నుంచీ ఎనిమిది, మదనపల్లె మోడల్ పాలిటెక్నిక్ నుంచీ మూడు, గూడూరు పాలిటెక్నిక్ నుంచీ ఒకటి చొప్పున మొత్తం 21 నాన్ టీచింగ్ పోస్టులు ఇతర జిల్లాలకు బదిలీ అయ్యాయి.

● నంద్యాల పాలిటెక్నిక్ నుంచీ తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్‌కు ఒకటి, కళ్యాణ దుర్గం నుంచీ పలమనేరు బాలికల పాలిటెక్నిక్‌కు ఒకటి చొప్పున రెండు టీచింగ్ పోస్టులు బదిలీ అయ్యాయి. అలాగే శ్రీశైలం, కర్నూలు, నంద్యాల పాలిటెక్నిక్‌ల నుంచీ ఒక్కోటి చొప్పున మూడు నాన్ టీచింగ్ పోస్టులు సత్యవేడు పాలిటెక్నిక్‌కు వచ్చాయి.

● తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలోనే ఒక పాలిటెక్నిక్ నుంచీ మరో పాలిటెక్నిక్‌కు 8 టీచింగ్ పోస్టులను సర్దుబాటు చేశారు. పలమనేరు బాలికల పాలిటెక్నిక్ నుంచీ మూడు, మదనపల్లె మోడల్ పాలిటెక్నిక్, కలికిరి, పిళ్యారిపట్టు, చంద్రగిరి పాలిటెక్నిక్‌ల నుంచీ ఒక్కోటి చొప్పున ఏడు టీచింగ్ పోస్టులు తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్‌కు బదిలీ చేశారు.

## నేడు కానిస్టేబుళ్ల ఎంపిక పరీక్షలు

● నిమిషం ఆలస్యమైనా లోపలకు నో ఎంట్రీ

● అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్



తిరుపతిలోని పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం కానిస్టేబుళ్ల ఎంపికకు రాత జరగనుంది. ఈ పరీక్షకు 5207 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే రాత పరీక్షకు నిమిషం ఆలస్యమైన లోపలకి అనుమతి లేదని అదనపు ఎస్పీ, పరీక్షల నోడల్ అధికారి రవిమనోహరాచ్చారి ప్రకటించారు. అభ్యర్థులందరూ గంటన్నర ముందుగా కేంద్రం వద్దకు చేరుకోవాలని సూచించారు. అక్కడ బయోమెట్రిక్ వద్ద వేలి ముద్ర వేసి లోపలికి వెళ్ళి ఆయా కేంద్రాల వద్ద పరీక్షలు రాయాలన్నారు. తిరుపతిలో ఏడు, రేణిగుంటలో ఒకటి, తిరుచానూరులో ఒకటి వంతున కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రం వద్ద సీఐ, ఎస్‌ఐలు, నలుగురు కానిస్టేబుళ్ళు ఇద్దరు మహిళా కానిస్టేబుళ్ళను, ఒక స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్‌ను నియమించారు. డీఎస్పీ భక్తవత్సలం నేతృత్వంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రానికి 100 మీటర్ల లోపు వరకు ఎలాంటి జిరాక్స్ సెంటర్లు, బుక్ షాపులు, ఇతర దుకాణాలు తెరచి వుండకూడదని పోలీసులు విజ్ఞప్తి చేశారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఒక పెన్, పరీక్ష ప్యాడ్ మాత్రమే తీసుకెళ్లొచ్చన్నారు. తిరుపతిలోని పరీక్షా కేంద్రాలను శనివారం డీఎస్పీ భక్తవత్సలం, ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐలు పరిశీలించారు.

**జిల్లా వ్యాప్తంగా 30 పోలీసు యాక్ట్**

పోలీసు కానిస్టేబుల్ రాత పరీక్షల నేపథ్యంలో జిల్లాలో సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ హర్షవర్ధనరాజు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి వచ్చేనెల 30వ తేది వరకు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పోలీసు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసన, ధర్నా కార్యక్రమాల నిర్వహించరాదని తెలిపారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు

## గుంతకల్లు వరకు పొడిగింపు

ఎర్రగుంట్ల/కొండాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): కడప-విశాఖపట్నం మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు (ట్రైన్ నెంబర్18521/18522)ను సోమవారం నుంచి గుంతకల్లు వరకు పొడిగించినట్లు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కడప నుంచి గుంతకల్లు వరకు ఈ ట్రైన్‌ను స్పెషల్ ట్రైన్ (నెంబర్ 07521 /07522)గా ట్రీట్ చేస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నం నుంచి కడపకు ఉదయం 7.45 గంటలకు చేరుకుని ఎర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గుత్తి మీదుగా గుంతకల్లుకు ఉదయం 11.15కు చేరుతుంది. తిరిగి గుంతకల్లులో మధ్యాహ్నం 1.30కి బయలుదేరి కడపకు సాయంత్రం 5.15కు చేరుకుంటుంది. అక్కడి నుంచి విశాఖపట్నం వెళుతుంది.

# ఏక్ నిరంజన్.. శ్యాంప్సన్

● 20 ఏళ్లక్రితం నైజీరియా నుంచి తిరుపతికి

● ఎస్వీయూలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తి

● అనారోగ్యంతో మృతి చెంది అనాథగా అంత్యక్రియలు

తిరుపతి- ఆంధ్రజ్యోతి

నైజీరియాకు చెందిన ఎస్వీయూ పరిశోధక విద్యార్థి శ్యాంప్సన్ ఓకాన్ (65)నెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. వారి కుటుంబీకులు ఎవరూ రాకపోవడంతో కలెక్టర్ ఆదేశాలతో శనివారం సాయంత్రం జీవకోనలోని శ్మశానవాటికలో క్రైస్తవ మత ఆచారంతో పోలీసులు అంత్యక్రియలు పూర్తి చేశారు.

**ఎవరీ శ్యాంప్సన్**

నైజీరియా దేశాన్ని ఎందుకు విడిచిపెట్టారో తెలియదు. ఇరవై ఏళ్ల క్రితమే ఇండియాకి వచ్చారు. తిరుపతికి చేరుకుని సుమారు తన 45 ఏళ్ల వయస్సులో ఎస్వీఎస్ కాలేజీలో డిగ్రీలో చేరారు. డిగ్రీ పూర్తయిన తర్వాత (2003-06) ఎస్వీ యూనివర్సిటీ స్టాటిస్టిక్స్ విభాగంలో పీజీలో చేరారు. 2006-08 పీజీ తర్వాత రెండేళ్ల విరామం అనంతరం ప్రొఫెసర్ సుబ్బరామిరెడ్డి పర్యవేక్షణలో (2010) పీహెచ్‌డీ చేరి 2019లో డాక్టరేట్ పొందారు. డిగ్రీ, పీజీ చదువుకునే సమయంలో వెస్ట్ చర్చి వద్ద ఎస్‌ఏఎల్సీ ఆధ్వర్యంలో ఉండే క్రిస్టియన్ హాస్టల్ (ప్రస్తుత కలెక్టర్ నివాసం పక్కన)లో ఉండేవారు. 2017లో ఎల్బీనగర్‌లోని ఓ చర్చిలో రేకుల గదిలో అద్దెకు చేరారు. ఏప్రిల్ 27న సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి యజమాని టీపీ మధుకుమార్ చూస్తే అస్వస్థతతో కనిపించారు. 108కు సమాచారమిచ్చి రుయాస్పత్రిలో చేర్పించగా.. అక్కడ చికిత్సపొందుతూ రాత్రి 11 గంటల ప్రాంతంలో మృతిచెందారు.



శ్యాంప్సన్ మృతదేహం

**35 రోజులగా మార్చురీలో..**

ఇంటి యజమాని మధు కుమార్ ఫిర్యాదు మేరకు యూనివర్సిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో శ్యాంప్సన్ వీసా (పాస్‌పోర్ట్ నెంబరు -ఏ312988) గడవు ముగిసినట్లు గుర్తించారు. ఆయన మృతిచెందినట్లు న్యూఢిల్లీలోని నైజీరియా హైకమిషన్‌కు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఎవరూ సుముఖత చూపలేదు. నెలరోజులకు పైగా మార్చురీలో ఉన్న మృతదేహం డీకంపోజ్ అవుతోందని, వెంటనే తీసుకెళ్లాలని ఎస్వీ మెడికల్ కాలేజ్ ఫోరెన్సిక్ వైద్యులు పోలీసులకు సూచించారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో తిరుపతిలోనే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించారు. విదేశీ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల మేరకు క్రిస్టియన్ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయాలని కమిషనర్ మౌర్యకు కలెక్టర్ సూచించారు. శనివారం పోలీసులు కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని శ్యాంప్సన్ మృతికి సంబంధించిన డాక్యుమెంట్లను అందజేశారు. శనివారం నగరపాలక సంస్థ పరిధిలోని జీవకోన సంజయ్‌గాంధీ కాలనీ స్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

## 5న ఐదు లక్షల మొక్కలు నాటాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 31(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 5వ తేదీన జిల్లావ్యాప్తంగా 5లక్షల మొక్కలు నాటాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో అటవీ, డ్వామా, గ్రామ పంచాయతీ శాఖ అధికారులతో ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ హరితాంధ్రప్రదేశ్ వనం మనం కార్యక్రమంలో భాగంగా ఈ మేరకు మండలాలు, మున్సిపాలిటీల్లో ఏర్పాట్లు చేపట్టాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వ భూములు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడానికి చర్యలు చేపట్టాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గం చిన్నగొట్టిగల్లు, ఎర్రవారిపాళెం మండలాల్లో ఏనుగుల సంచారం ఎక్కువగా ఉంటోందని, అక్కడ నిమ్మ తోటలు పెంచేలా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, డీపీవో సుశీలాదేవి పాల్గొన్నారు.

**విపత్తు నిర్వహణపై ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి**

విపత్తు నిర్వహణపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శనివారం టెలీ కాన్ఫరెన్సు నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఈ ఏడాది అధికంగా వర్షాలు పడే అవకాశమున్న నేపథ్యంలో పంట కాల్వలు, చెరువు కట్టలు, చెక్‌డ్యామ్‌లను బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీల్లో మురుగు, చెత్త తొలగించాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

## రూ.21.27 కోట్లతో 303 ఇరిగేషన్ పనులు

● అనుమతిచ్చిన ప్రభుత్వం

తిరుపతి, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ పరిధిలో రూ.21.27 కోట్లతో 303 ఇరిగేషన్ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి సంఘాలు లేని చోట్ల, రూ.10 లక్షల అంచనా వ్యయం పైబడిన పనులకు షార్ట్ టెండర్లు పిలిచేందుకు అనుమతించాలని ఇరిగేషన్ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. మైనర్, మీడియం, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో నిర్వహణ కింద రూ.344.39 కోట్లతో 7174 పనులు చేపట్టేందుకు సంబంధిత అనుమతులు అవసరమని కోరారు. ఇందులో తిరుపతి తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ పరిధిలో రూ. 21.27 కోట్లతో 303 పనులు ప్రతిపాదించారు. షార్ట్ టెండర్ నోటీసులు జారీ చేసి ఈ పనులు చేపట్టేందుకు అనుమతినిస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి అనంతరాము శనివారం ఉత్తర్వులు ఇచ్చారు.

# జల్సాల కోసం చోరీలు

● నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మే 31 (ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లు, విలాసజీవతం కోసం అప్పులపాలయ్యాడు. ఆపై సులభ సంపాదనకు దొంగతనం వైపు అడుగేసిన అతడిని తిరుపతి క్రైం పోలీసులు అరెస్టు చేశారు. క్రైం జిల్లా అదనపు ఎస్పీ నాగభూషణరావు తెలిపిన మేరకు.. చిన్నగొట్టిగల్లు మండలం వంకమద్దివారిపల్లికి చెందిన తమటం భానుచంద్రాచ్చారి చిన్నప్పుడే చెడు అలవాట్లకు లోనయ్యాడు. చుట్టు పక్కల వారిని చూసి తానూ విలాస జీవితం గడపాలని అప్పులుచేసి ఇల్లు కట్టాడు. చివరకు అప్పులు తీర్చలేక.. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాలోచనతో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. తిరుపతి నగరం ఎంఆర్‌పల్లె, చెర్లోపల్లె, శ్రీకృష్ణనగర్ తదితర ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేశాడు. ఇళ్లు, దుకాణాల్లో దొంగిలించిన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, గ్యాస్ సిలిండర్లు, టీవీలను విక్రయించేవాడు. ఆ డబ్బుతో కొంత అప్పులు తీర్చి మిగతా జల్సాలకు ఖర్చు చేసేవాడు. ఇతనిపై చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లోనూ పలు దొంగతనం కేసులు ఉన్నట్లు సమాచారం. మే 4న శ్రీకృష్ణనగర్‌లోని పుల్లారెడ్డి కుటుంబం బెంగళూరకు వెళ్లింది. మళ్ళీ మే 16న ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగులకొట్టి ఉంది. ఇంట్లోని దాదాపు 21 గ్రాముల బంగారు నగలు, 488 గ్రాముల వెండి వస్తువులు, రెండు టీవీలు, ఇతర వస్తువులు లేవు. క్రైం డీఎస్పీ శ్యాంసుందర్‌కు బాధితుడు ఫిర్యాదు చేశారు. పాత నేరస్తులు ఎవరు? ఏ ప్రాంతానికి చెందిన వారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడి ఆచూకీ గుర్తించారు. వేలి ముద్రలు, ఫొటో ఆధారంగా నిందితుడు చిన్నగొట్టిగల్లు మండలానికి చెందిన వాడని గుర్తించారు. అతడి సెల్‌ఫోన్ నెట్‌వర్కు ఆధారంగా శనివారం రాయలచెరువు రోడ్డులో తచ్చాడుతుండగా క్రైం డీఎస్పీ నేతృత్వంలోని సీఐలు చిన్న పెద్దయ్య, శివకుమార్ రెడ్డి, ప్రకాష్, ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్, క్రైం పార్టీ పోలీసులు నిఘా ఉంచి అరెస్టు చేశారు. ఎస్వీయూ పరిధిలో జరిగిన రెండు చోరీలు, క్రైం పరిధిలో జరిగిన ఒక చోరీ కేసుకు సంబంధించి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రెండు టీవీలు, గ్యాస్ సిలిండర్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐలతో పాటు ఎస్‌ఐ, ఏఎస్‌ఐ దామోదరం, హెడ్ కానిస్టేబుళ్ళు రవిప్రకాష్, మురళి, మునిరాజ, రమేష్, కానిస్టేబుళ్ళు నాగరాజు, మోహన్, ఈశ్వర్, హరిప్రసాద్‌ను ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందచేశారు.



తిరుపతిలో క్రైం పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు

## భూ ఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు



ఎస్ఐ నాగరాజుకు ఫిర్యాదు అందజేస్తున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): తనకు వారసత్వంగా వచ్చిన భూమిని మునివర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి ఆక్రమించి వరినాట్లు వేశాడని మండలంలోని ఆర్లపాడు గ్రామానికి చెందిన సన్నాడి సుబ్రహ్మణ్యంరెడ్డి స్థానిక టీడీపీ నాయకులతో కలిసి శనివారం ఎస్ఐ నాగరాజుకు ఫిర్యాదు చేశాడు. సర్వే నెంబరు 319-13లోని 13 సెంట్లు మాగాణి భూమి తన తండ్రి జయరామిరెడ్డి నుంచి వారసత్వంగా వచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 1బీ, అడంగళ్‌లో కూడా తన పేరు మీదనే ఉన్నాయని, పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ భూ వివాదం డీఆర్వో కోర్టులో ఉన్నందున రెవెన్యూ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాగా, భూ ఆక్రమణలపై రెవెన్యూ, పోలీస్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, ఆ పార్టీ సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి కోరారు. కొంతమంది అధికారుల తీరుతో ఆర్లపాడు గ్రామంలో భూముల రికార్డులు తారుమారయ్యాయని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే విజయశ్రీతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని రమేష్ నాయుడు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిరసనంబేటి చైతన్య కృష్ణారెడ్డి, కలవకోలు మునీష్, దువ్వూరు రాకేష్‌రెడ్డి, కేవీ నాయుడు, నర్రావుల లోకేష్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్ పనుల అడ్డగింత



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ కొండప నాయుడు

తడ, మే 31 (ఆంధ్రజ్యోతి): మాంబట్టు సెజ్‌లో సబ్‌స్టేషన్ పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. మాంబట్టులో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి కొద్ది రోజుల క్రితం ముఖ్యమంత్రి చేతులమీదుగా శంకుస్థాపన జరిగింది. ఆ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సెజ్‌లో భూములను రెవెన్యూ అధికారులు కేటాయించారు. శనివారం ట్రాన్స్‌కో డీఈ బలరామ్‌మూర్తి ఆధ్వర్యంలోని అధికారుల బృందం పనులను శనివారం ప్రారంభించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. సదరు స్థలాన్ని నివాస గృహాల కోసం కేటాయించారని, మరొక చోట సబ్‌స్టేషన్ నిర్మించాలని చెప్పారు. ట్రాన్స్‌కో అధికారులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ కొండపనాయుడు ఘటనాస్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. రెవెన్యూ అధికారులు సర్వేచేసి సమస్య పరిష్కరించే వరకు పనులను అడ్డుకోవద్దని సూచించారు.

## పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దాం




ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కోట, మే 31 (ఆంధ్రజ్యోతి): అందరూ కలిసి కట్టుగా అవగాహనతో పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దామంటూ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రతిజ్ఞ చేశారు. శనివారం కళాశాలలో వరల్డ్ నో టొబాకో డే నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు పొగాకు వాడటం వల్ల కలిగే నష్టాలను ప్లకార్డుల ద్వారా ప్రదర్శిస్తూ కళాశాల నుంచి విద్యానగర్ గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పొగాకు వినియోగం సరదాగా మొదలు పెట్టి అలవాటుగా మారి, అటు తర్వాత వ్యసనంగా మారుతుందన్నారు. ఫలితంగా ఆరోగ్యం దెబ్బతింటుదన్నారు. యువత ధూమపాన అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ మల్లిఖార్జునరెడ్డి, డాక్టర్ మాధవయ్య, ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి



గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

డక్కిలి, మే 31(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంచాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని సంగనపల్లిలో సివిల్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఎంఈవో జగదీష్ బాబు మాట్లాడుతూ బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు బడిలో చేర్పించాలని కోరారు. గ్రామంలో డ్రాపౌట్స్ లేకుండా చూడాల్సి బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శివశంకర్, ఈవోపీఆర్డీ అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థినికి ఆర్థిక సాయం

సూళ్లూరుపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని సాయినగర్‌లో ఉంటున్న ప్రతిభ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థిని కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఆమె వైద్యం కోసం సేకరించిన రూ.33 వేలను పూర్వ విద్యార్థులందరూ శనివారం ఆ విద్యార్థిని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి మణివాస్, సూళ్లూరుపేట సేవా సమాఖ్య సభ్యులు ఉస్మాన్ బాషా, మల్లికార్జున, జగన్నాథ్, శివ తదితరులు పాల్గొన్నారు.

## పౌర హక్కులకు భంగం కలిగించొద్దు

వాకాడు, మే 31 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఒకరి హక్కులకు మరొకరు భంగం కలిగించకూడదని తహసీల్దారు రామయ్య అన్నారు. మండలంలోని దుగరాజపట్నం పంచాయతీ, అంజలపురం మత్స్యకార గ్రామాల్లో శనివారం పౌరహక్కుల దినం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ పౌరహక్కులకు భంగం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అందరూ సోదర భావంతో మెలగాలని, కులవివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు సందీప్, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు రామయ్య

## 10న డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

నాయుడుపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 10వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మధుసూదన శర్మ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ శనివారం ఆవిష్కరించారు. శ్రీసిటీ, మేనకూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, చెన్నైలోని 17 బహుళ జాతీయ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సి పాల్ తెలిపారు. 5 నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత అయిన యువతి, యువకులు జాబ్‌మేళాలో పాల్గొన వచ్చన్నారు. 99850 56929, 9988853335 నెంబర్లకు కాల్‌చేసి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

## డిగ్రీ కళాశాలలో యోగా శిక్షణ

సూళ్లూరుపేట, మే 31(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ వెంకటశర్మ మాట్లాడుతూ యోగాతో మానసిక ఒత్తిడిని సులభంగా జయించే శక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ డాక్టర్ జె.సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు నాగభూషణం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.





వావిళ్ల దొరువు వద్ద ఆరబెట్టిన వేరుశనగ - ధర రాకున్నా తప్పనిసరి పరిస్థితుల్లో అమ్మకాలు

# వేరుశనగ... దళారుల దగా

- గుజరాత్ సీడ్‌కు డిమాండ్ లేదంటూ ప్రచారం
- తీరప్రాంత రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు
- నష్టాలపాలవుతున్నామంటూ అన్నదాతల ఆవేదన

కోట, మే 31 (ఆంధ్రజ్యోతి): సముద్రతీర గ్రామాల్లోని వేరుశనగ రైతులు దళారుల చేతుల్లో దగాపడుతున్నారు. సిలికా భూముల్లో మూడు నెలల పాటు సాగు చేసిన గుజరాత్ రకం పంటకు గిట్టుబాటు ధర లభించక నష్టాల బాటపడుతున్నారు. రెండు నెలల వరకు డిమాండ్‌తో ఉన్న ఈ రకం కాయలకు హఠాత్తుగా మార్కెట్‌లో డిమాండ్ పడిపోయిందంటూ బ్రోకర్లు చేస్తున్న ప్రచారంతో రైతులు దిగులు చెందుతున్నారు. కోట, చిల్లకూరు సరిహద్దు మండలాల్లోని సిలికా భూముల్లో రైతులు కొన్నాళ్లుగా వేరుశనగ సాగు చేస్తున్నారు. బిందుసేద్యం ద్వారా లాభాలు గడిస్తూ వచ్చారు. ఈ ఏడాది అదను పోకమునుపే 3500 ఎకరాల్లో గుజరాత్ సీడ్ సాగు చేపట్టారు. అయితే ఈసారి అనుకున్న దిగుబడి రాలేదు. దీనికితోడు గిట్టుబాటు ధర కూడా లభించడంలేదు. ఇదే అదునుగా దళారులు రంగంలోని దిగారు. గుజరాత్ సీడ్ రకానికి డిమాండ్ పడిపోయిందంటూ ప్రచారం మొదలెట్టారు. రైతులు బయట ప్రాంతమార్కెట్లకు వెళ్లి సొమ్ము చేసుకోలేక బ్రోకర్లు అడిగిన ధరకే పంటను అమ్ముకుంటూ నష్టాలను మూటగట్టుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం 460 కిలోల(పుట్టి) గుజరాత్ సీడ్ వేరుశనగ కాయలకు రూ.34 వేల నుంచి రూ.35వేల వరకు పలికింది. ప్రస్తుతం డిమాండ్ లేదనే సాకుతో దళారులు రూ.30వేలకు కొంటున్నారు. పంటపై పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో అమ్ముకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





గూడూరులో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, నాయుడుపేటలో ఎమ్మెల్యే విజయశ్రీ పింఛన్ల పంపిణీ

# హామీలన్నీ అమలు చేస్తాం: పాశం

గూడూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని, ఇందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని విఘ్నేశ్వరపురంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా ప్రతి హామీని సీఎం నేరవేరుస్తున్నారన్నారు. జూన్ నుంచి తల్లికి వందనం, అన్నదాన సుఖీభవ, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను ప్రభుత్వం అమలు పరచనుందన్నారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా వర్షాల సమయంలో నివాస గృహాల్లోకి వరద నీరు చేరుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వరదనీరు చేరకుండా ఉండేందుకు రివెట్‌మెంట్ వాల్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, బిల్లు చెంచు రామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్ కుమార్, బత్తిన ప్రణీత్, ఓం ప్రకాష్, రవీంద్రరెడ్డి, వాటంబేడు హరి, పేటేటి చంద్రనీల్, చంద్ర మౌళి, నటశేఖర్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

**నాయుడుపేట టౌన్:** పట్టణంలోని బీడీ కాలనీలో లబ్ధిదారులకు శనివారం ఉదయం ఎమ్మెల్యే విజయశ్రీ పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, టీడీపీ నాయకులు నానాబాల సుబ్బారావు, నిత్యకృష్ణారెడ్డి, పొట్లపూడి రాజేష్, షరీఫ్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వెంకటగిరి:** పట్టణంలోని 10వ వార్డు మనులాలపేటలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాధ నాయుడు, గంగాధరం, బీరం రాజేశ్వరరావు, మంకు ఆనంద్, కాపా శ్రీనివాసులు నాయుడు, చెంగారావు తదితరులు పాల్గొన్నారు.

**చిల్లకూరు:** మండలంలోని ఓడూరు గ్రామంలో లబ్ధిదారులకు టీడీపీ తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి పింఛన్లు అందజేశారు. గుండాల శ్రీనివాసులు, చిట్టేటి కీరవాణి పాల్గొన్నారు.

**పెళ్లకూరు:** మండలంలోని కొత్తూరు, పెళ్లకూరు, తాళ్వాయిపాడు, చిల్లకూరు గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పింఛన్లు పంపిణీ చేశారు. స్వర్ణముఖినది ఆనకట్ట కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, రాధానాయుడు, బైనా సుబ్రహ్మణ్యంరెడ్డి, నర్రావుల మోహన్‌నాయుడు, వేణురెడ్డి, గోపి, చలపతి పాల్గొన్నారు.

# పొగాకు ఉత్పత్తుల వినియోగం అనారోగ్యకరం







గూడూరు, సూళ్లూరుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, విద్యార్థులు

గూడూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా అన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా పొగ తాగడం, పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వల్ల క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు వస్తాయన్నారు. ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటూ ఆరోగ్యంగా గడపాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మోహనా, డాక్టర్ ప్రసన్న, సిబ్బంది లలిత తదితరులు పాల్గొన్నారు.

**సూళ్లూరుపేట:** పట్టణంలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం నిర్వహించారు. కళాశాల నుంచి షార్ బస్టాండు వరకు ర్యాలీ చేశారు. ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ మాట్లాడుతూ ధూమపానం నిర్మూలనపై విద్యార్థులు గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కోటీశ్వరరావుకు సన్మానం



కోటీశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగస్తులు

వెంకటగిరి టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎంపీడీవో కోటీశ్వరరావు శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించారు. కోటీశ్వరరావు, లక్ష్మీ ప్రభావతి దంపతులను గజ మాలతో సత్కరించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

## భూ సారాన్ని అనుసరించి పంటలను సాగు చేయాలి

వెంకటగిరి టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): భూ సారాన్ని అనుసరించి పంటలను సాగు చేయాలని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త శ్రీనివాసులురెడ్డి అన్నారు. శనివారం స్థానిక యాతలూరు, మన్నేగుంట, బంగారుపేటలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఖరీఫ్ పంటలకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పంట వైవిధీకరణ వంటి అంశాల గురించి విశదీకరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## పేదలకు దుస్తుల పంపిణీ

గూడూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో శనివారం డాక్టర్ రమణయ్య దాతృత్వంతో పేదలకు దుస్తులు, ఆహార పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాధయ్య, మురళీ నాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

చిల్లకూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపి ఆలయ ఆవరణలో ఊరేగించారు.

## వేధింపులపై ఫిర్యాదు

కోట, మే 31 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని ఓ చిట్‌ఫండ్ కమిటీ అధికారుల వేధింపులు తాళలేకే తన భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని మండల పరిధిలోని కేశవరం పంచాయతీ రాఘవపురం గ్రామానికి చెందిన గడ్డం పద్మావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త మహేష్ ఓ ప్రైవేట్ చిట్ ఫండ్ కంపెనీలో ఏజెంట్‌గా పనిచేస్తారని, ఇన్సూరెన్స్ నగదును రూ.6 లక్షలకు పైగా చెల్లించడం జరిగిందన్నారు. అయితే పైసా కూడా చెల్లించలేదని ఆ కంపెనీ అధికారులు చెప్పడంతో తన భర్త మహేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## నేడు రక్తదాన శిబిరం

సూళ్లూరుపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో ఆదివారం సూళ్లూరుపేట సేవా సమాఖ్య, ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఉస్మాన్ బాషా తెలిపారు.

## ఏపీవో దయానందంకు సత్కారం

పెళ్లకూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): ఏపీవో దయానందం శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో దయానందం దంపతులను అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఎంపీడీవో ప్రమీలారాణి, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్, టీడీపీ, బీజేపీ మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య, కలిచేటి నరసింహులు, నాయకులు సిద్దులయ్య, మురళీ నాయుడు, హరినాయుడు, కేవీనాయుడు, యుగందర్, పోలయ్య, సుబ్రహ్మణ్యం, గోగుతోటి మురళి, కలపాటి సురేష్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



దయానందం దంపతులను సత్కరిస్తున్న అధికారులు

## రాయితీపై రైతులకు డ్రోన్ల పంపిణీ

గూడూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై రెండు డ్రోన్‌లను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రైతులకు ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయలేదన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా 80శాతం రాయితీతో రైతులకు డ్రోన్‌లను అందజేశామన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్‌గా భానుప్రకాష్‌రెడ్డి



గూడూరు అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్‌గా శ్రీకాళహస్తి ఆర్డీవోగా భానుప్రకాష్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాఘవేంద్రమీనా జూన్ 20వ తేదీ వరకు సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో శ్రీకాళహస్తి ఆర్డీవోగా భానుప్రకాష్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. భానుప్రకాష్‌రెడ్డికి రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## తిన్నెలపూడిలో సివిల్ రైట్స్ డే




కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జయజయరావు

కోట, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి పంచాయతీ నారుమిట్ట గిరిజన కాలనీలో శనివారం సివిల్ రైట్స్ డే జరిగింది. తహసీల్దార్ జయజయరావుతో పాటు వివిధ శాఖల అధికారులు పౌర హక్కుల అవశ్యకత గురించి వివరించారు. రాజ్యాంగం ద్వారా గిరిజనులకు సంక్రమించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మస్తానయ్య, ఈవోపీఆర్డీ కిరణ్‌కుమార్, సరిత తదితరులు పాల్గొన్నారు.

## మురుగు కాలువల్లో పూడికతీత

సూళ్లూరుపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షార్ బస్టాండు, షార్ సర్కిల్ పరిధిలోని మురుగు కాలువల్లో శనివారం పూడిక తీత పనులు ప్రారంభించారు. కాలువల్లో మురుగునీరు సజావుగా పారేం దుకు వీలుగా చెత్త, చెదారం, వ్యర్థాలను తొలగించారు. వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని మురుగు నిల్వకుండా డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయ డంతో పాటు పారిశుధ్యం దృష్టి పెట్టినట్లు కమిషనర్ చిన్నయ్య తెలిపారు.


## లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి



అర్జున్ (ఫైల్)

నాగలాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతిచెందిన సంఘటన నాగలాపురం మండలం బైటకొడియంబేడులో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ సునీల్ కథనం మేరకు.. బైటకొడియంబేడు గ్రామానికి చెందిన అర్జున్ (49) ద్విచక్ర వాహనంలో నందనం గ్రామానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా చెన్నై నుంచి తిరుపతి వైపు వస్తున్న ఓ కంటైనర్ అతడి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన అర్జున్‌ను స్థానికులు నాగలాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు అర్జున్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి



సత్యవేడు, మే 31 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతిచెందాయి. ఈ ఘటన సత్యవేడు మండ లం వీఆర్ కండ్రిగలో శనివారం చోటు చేసు కుంది. స్థానికుల కథనం మేరకు.. వీఆర్‌కండ్రిగ హరిజన వాడకు చెందిన మునికృష్ణయ్యకు రెండు ఆవులు ఉన్నాయి. వాటిని తమ ఇంటి సమీపంలో కట్టేయడానికి మునిక్రిష్ణయ్య కుమారుడు దివాకర్ తీసుకెళుతుండగా హఠాత్తుగా 11 కేవీ వైర్లు తెగి ఆవులపై పడ్డాయి. దీంతో ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. దివాకర్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. వెటర్నరి డాక్టర్ పార్తిబన్ ఆవులకు పోస్టుమార్టం నిర్వహించారు. తమకు జీవనాధారమైన ఆవులు మృత్యువాత పడడంతో ఆదుకోవాలని రైతు మునిక్రిష్ణయ్య కోరుతున్నాడు.

## ఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ సీజీఎంగా రామమోహన్‌రావు

తిరుపతి(ఆటోనగర్), మే 31(ఆంధ్రజ్యోతి) : ఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ సీజీఎంగా కె.రామమోహన్‌రావును నియమిస్తూ శనివారం ఆ సంస్థ సీఎండీ కె.సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ స్థానంలో విధులు నిర్వహిస్తున్న వై.లక్ష్మీనరసయ్య ఉద్యోగ విరమణ చేయడంతో భర్తీ చేశారు. గతంలో రామమోహన్‌రావు కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజరుగా విధులు నిర్వహించేవారు. ఆయనకు సీజీఎంగా పదోన్నతి కల్పించారు.

# యోగాతో మానసిక ప్రశాంతత

శ్రీకాళహస్తి, మే 31(ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. వాకర్స్‌తో కలిసి సీఐ నాగార్జునరెడ్డి యోగా చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 21న అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని ప్రజలు విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకురాలు సుజాత, న్యాయవాది రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పట్టువస్త్రాల సమర్పణ



ఏర్పేడు, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతవీరాపురంలో వెలసిన శ్రీకృష్ణ, ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయానికి శనివారం పట్టువస్త్రాలను సమర్పించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు మాజీ జడ్పీటీసీ ముని రంగారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ మునిధర్మారెడ్డి దంపతులు, చెంచరెడ్డి దంపతులు ఈ పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొంగర కృష్ణారెడ్డి, ఎం.మునీశ్వర్ పాల్గొన్నారు.

# పొగాకుకు దూరంగా ఉంటే ఆరోగ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకుకు దూరంగా ఉంటే ఆరోగ్యంగా ఉండవచ్చునని వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుట్కా నమిలినా, పొగ పీల్చినా క్యాన్సర్, ఊపిరితిత్తుల సమస్యలు వస్తాయని వివరించారు. పొగాకును పూర్తిస్థాయిలో నిర్మూలిస్తామని ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# టీడీపీ నాయకుడి కుమార్తెకు పలువురి నివాళి

శ్రీకాళహస్తి, మే 31(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు రవిచంద్ర కుమార్తె బాధాకరమని ఆ పార్టీ తొట్టంబేడు మాజీ మండలాధ్యక్షుడు గాలి మురళినాయుడు అన్నారు. తొట్టంబేడు మండలం కొణతనేరి పంచాయతీ గుర్రప్ప నాయుడుకండ్రిగకు చెందిన టీడీపీ నాయకుడు రవిచంద్ర కుమార్తె జ్యోతి అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మురళీనాయుడు ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు రవిచంద్రను ఫోన్‌లో పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుప్పయ్య, కిలారి వివేక్‌చౌదరి, బాబు, జనార్ధన్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



జ్యోతి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న గాలి మురళినాయుడు తదితరులు

# ఉద్యోగ విరమణ సిబ్బందికి సన్మానం



శ్రీకాళహస్తి, మే 31 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో శనివారం కండెక్టర్ సులోచనమ్మ, డ్రైవర్ శ్రీను, పీఆర్ఎం రెడ్డి, గ్యారేజీ మెకానిక్ శేఖర్ ఉద్యోగ విరమణ పొందారు. వీరిని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఘనంగా సత్కరించారు. ముక్కంటి స్వామి అమ్మవార్ల జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజరు మునిచంద్ర, డిపో కార్యదర్శి పసుపులేటి శ్రీనివాస్, కుమార్, జీపీఎస్ ఆచారి, టీఎల్ మూర్తి, కుప్పయ్య, సునీల్ నాయుడు, కుమార్, గురవమ్మ, బీజే లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తతతో విద్యుత్ మోటార్ల చోరీ నియంత్రణ

శ్రీకాళహస్తి, మే 31(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూముల్లో విద్యుత్ మోటార్లు, స్టార్టర్ల చోరీని నియంత్రించేందుకు అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని బుచ్చినాయుడు కండ్రిగ సీఐ తిమ్మయ్య తెలిపారు. తొట్టంబేడు మండల పరిధిలోని కొత్తకండ్రిగ, చోడవరం, చేమూరు, పిల్లమేడు, పెద్దకనపర్తి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. రైతులతో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఓ గుర్తుతెలియని దొంగలముఠా వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లను చోరీ చేస్తోందన్నారు. గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# భక్తజనసంద్రం ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, మే 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తులతో భక్తజన సంద్రంగా మారింది. వారాంతపు సెలవులు, వేసవి సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 27వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## శనీశ్వరుడికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, మే 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం గణపతి పూజ, కలశ పూజ చేశారు. పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

## 3 నుంచి బంగారమ్మ జాతర

శ్రీకాళహస్తి, మే 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణ శివారులో వెలసిన బంగారమ్మ అమ్మవారికి ఈ నెల 3, 4వ తేదీలలో జాతర నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఏర్పేడు, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే సీఎం చంద్రబాబు ధ్యేయమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. ఏర్పేడు మండల కేంద్రంలో శనివారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. నాయకులు మునెయ్య, నిరంజన్, కృష్ణవేణి, భాస్కర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## బీఎన్‌కండ్రిగలో 92శాతం పెన్షన్ల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు 92శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండలంలో 5001మందికి పింఛన్లు పంపిణీ చేయాలిస ఉండగా ఒక్క రోజే 4635మందికి పంపిణీ చేశామన్నారు. నెలవాయిలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు, బీఎన్ కండ్రిగలో టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు పంపిణీ చేశారు.

## 35 వ్యవసాయ మోటార్ల ధ్వంసం

శ్రీకాళహస్తి, మే 31(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూముల్లోని సుమారు 35 విద్యుత్ మోటారు పరికరాలను దొంగలు ధ్వంసం చేశారు. శ్రీకాళహస్తి మండలంలోని అమ్మపాళెం, చెర్లోపల్లి, మిట్టకండ్రిగ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు వ్యవసాయ మోటార్లకు అమర్చిన స్టార్టర్లు, విద్యుత్ వైర్లను అపహరించారు. మొత్తం 35వ్యవసాయ మోటార్లు దెబ్బతిన్నట్లు రైతులు వాపోయారు.

## వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజల్ సేవ



నారాయణవనం, మే 31(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకన్న ఊంజల్ సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు జరిపించారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకన్న ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తులు అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఆలయాధికారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ట్యాంకర్ లారీ ఢీకొని ఒకరి మృతి

వడమాలపేట,మే 31(ఆంధ్రజ్యోతి): కదిరిమంగళం బైపాస్ వద్ద శనివారం అయిల్ ట్యాంకర్ ఢీ కొనడంతో వడమాలపేట కట్టకింద ఎస్టీ కాలనీకి చెందిన చంద్రశేఖర్ (35) అక్కడికక్కడే మృతి చెందాడు. వడమాలపేటకు సమీపంలో కదిరిమంగళం బైపాస్ రోడ్డు వద్ద చంద్రశేఖర్ రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి చెన్నైకు వెళ్తున్న అయిల్ ట్యాంకర్ ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఎస్ఐ ధర్మారెడ్డి కేసు నమోదు చేశారు.

# ఇది పేదల ప్రభుత్వం: ఎమ్మెల్యే ఆదిమూలం



దివ్యాంగుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పిచ్చాటూరు, మే 31(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుది పేదల ప్రభుత్వమని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. శనివారం పిచ్చాటూరు మండలంలోని పులికుండ్రంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డును ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే పింఛన్ మొత్తం రూ.3 వేలు నుంచి 4 వేలుగా పెంచి పంపిణీ చేశారన్నారు. వీటితో పాటు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలు చేయడంతో పాటు ఈ నెల నుంచి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు కానుందని ఎమ్మెల్యే వివరించారు. త్వరలో ఇల్లు లేని పేదలకు 3 సెంట్లు ఇంటి స్థలం, పక్కా ఇల్లు మంజూరు చేయనున్నారని తెలియజేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మహ్మద్‌రఫీ, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, సర్పంచ్ దిలీప్‌రాజు, టీడీపీ సీనియర్ నాయకులు పద్దురాజు, సుమాంజలి, రామచంద్రరాజు, రాజేశ్వరి పాల్గొన్నారు.

# ఎరువులు అధికంగా వినియోగించరాదు



రైతులకు డ్రోన్ పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ, మే 31 (ఆంధ్ర జ్యోతి): రసాయన ఎరువులు అధిక మోతాదులో ఎరువులను వినియోగించరాదని జాతీయ మెట్టసేద్య పరిశోధన కేంద్రం హైదరాబాదు (సీఆర్ఐడీఏ) శాస్త్రవేత్త శ్రీసుకుంత్ తెలిపారు. మండలంలోని కాటూరు, పార్లపల్లి, పల్లమాల గ్రామాలలో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం తిరుపతి వారి ఆధ్వర్యంలో సంకల్ప అభియాన్ రైతు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ప్రాముఖ్యత, జీవన ఎరువులు, భూమి ఆరోగ్యంపై రైతులకు అవగాహన కల్పించారు. తిరుపతి ఉద్యాన పంటల నిపుణుడు సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ కార్యక్రమాలు గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాల్ సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయంపై వివరించారు. మండల వ్యవసాయాధికారి భారతి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను తెలియజేశారు. డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి శారద, మండల పశువైద్యాధికారి అశ్విని, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సిబ్బంది, గ్రామ వ్యవసాయ సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించండి

బుచ్చినాయుడుకండ్రిగ, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. పౌరహక్కుల దినోత్సవంలో భాగంగా మండలంలోని పల్లమాల పంచాయతీలోని శుద్ధమిట్ట గిరిజన కాలనీలో సామాజిక న్యాయంపై స్థానికులకు రెవెన్యూ, మండల పరిషత్, పోలీసు శాఖ వారు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విశ్వనాథనాయుడు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు హక్కులపై అవగాహన ఉండాలన్నారు. అగ్రవర్ణాలు వారు చిన్న చూపు చూస్తే చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమణమ్మ, ఆర్ఐ నల్లయ్య, వెలుగు ఏపీఎం మునెయ్య, ఇతర శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంఘ మిత్ర దాముకి ఎమ్మెల్యే ఆదిమూలం నివాళి

పిచ్చాటూరు, మే 31(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం శేషంపేట గ్రామంలో సంఘమిత్ర దాము శుక్రవారం మృతిచెందాడు. ఎమ్మెల్యే ఆదిమూలం శనివారం ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, అరణియార్ ప్రాజెక్టు చైర్మన్ రవి, చిన్న, వాసురెడ్డి, ఢిల్లీ తదితరులు నివాళులర్పించారు.

## ఈటీసీ ప్రిన్సిపాల్‌కు సన్మానం



నాగపద్మజను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, మే 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాసాగార్డెన్‌లో గల ఈటీసీ సెంటర్ ప్రిన్సిపాల్ నాగపద్మజ శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా నాగపద్మజ, గుడ్లూరు జగన్మోహన్‌నాయుడు దంపతులను టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దశరధాచారి, మండల పార్టీ నాయకులు నైనారు పొన్నారావు, మురళి నాయుడు పాల్గొన్నారు.

● శ్రీకాళహస్తీశ్వ రాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు నాగపద్మజ దంపతులను ఘనంగా సత్కరించి స్వామి అమ్మవార్ల చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు శ్రీవారి సురేష్, వేలూరు రమేష్, సాయి, ఈటీసీసెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆంగ్ల ఉపాధ్యాయుడికి సన్మానం



వరదయ్యపాళెం, మే 31(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎస్.మహేంద్రన్ శనివారం ఉద్యోగ విరమణ పొందారు. పాఠశాల ఆవరణంలో ఆయనను పలువురు ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు కుమార్, ఉపాధ్యాయులు మేఘనాథ్, రంగనాథ్, రాజయ్య, నాగరాజు పాల్గొన్నారు.

## యువకుడికి రిమాండ్

రేణిగుంట, మే 31, (ఆంధ్రజ్యోతి) : బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడుని శనివారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కరకంబాడి పంచాయితీలోని ఓ కాలనీలో నివాసముంటున్న ప్రసన్న అనే యువకుడు సమీపంలో ఇంట్లో ఉన్న బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు శుక్రవారం యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. సీఐ జయచంద్ర కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# పుత్తూరు వార్తలు

## వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట,మే 31 (ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం వేకువ జామున సుప్రభాతసేవతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని సర్వాభరణాలు, పూలమాలలతో అలంకరించి వేద మంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఊంజల సేవ నిర్వహించారు. సర్వాలంకార భూషితుడైన పద్మావతీ ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని మేళతాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, ఆలయ అధికారి శివకుమార్ పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ జరీనా

వడమాలపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణదారులు సమయపాలన పాటించాలని తహసీల్దార్ జరీనా చెప్పారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ పంపిణీపై డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆదివారం నుంచి 15వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు తప్పనిసరిగా రేషన్ అందించాలని సూచించారు. అదేవిధంగా వృద్ధులకు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే వెళ్లి సరుకులు అందించాలని ఆదేశించారు.

**పుత్తూరు:** పుత్తూరు తహశీల్దార్ వెంకటేశ్వర్లు మండలంలోని 42 మంది డీలర్లతో సమావేశం నిర్వహించారు. రేషన్ సక్రమంగా సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీటీ అశోక్‌రెడ్డి, ఆర్ఐ గురుస్వామిలు పాల్గొన్నారు.

## వారాహి అమ్మవారి ఆలయంలో పంచమి పూజలు



పుత్తూరు టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండల పరిధిలోని పరమేశ్వర మంగళం సమీపంలో ఉన్న దక్షిణ కాళిఅమ్మన్ వారాహి శక్తిపీఠంలో శనివారం చిత్రపౌర్ణమి సందర్భంగా ఆలయ చైర్మన్ మోహనమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు జరిపించారు. అమ్మవారి ముందు శాంతి హోమాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. శీతల పానీయాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి హరి, భక్తులు పాల్గొన్నారు.

# అర్ధాంతరంగా ముగిసిన మున్సిపల్ మీట్

పుత్తూరు టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై చర్చ లేకుండానే పుత్తూరు మున్సిపల్ సమావేశం సభ్యులు వాగ్వాదంతో సభ రసాభాసగా మారింది. దీంతో సభ అర్ధాంతరంగా ముగిసింది. శనివారం పుత్తూరు మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ హరి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ అజెండా అంశాలను చదవి వినిపించారు. తొలుత అజెండా అంశాలను మాత్రమే చర్చించాలని, తర్వాత సమస్యల గురించి మాట్లాడాలని తెలియజేశారు. వైస్ చైర్మన్ జయప్రకాష్ మాట్లాడుతూ అధికార పార్టీ ఒత్తిళ్లతో ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని తొలగించడం అన్యాయమని, ఎవరు చెప్పి ఉద్యోగిని తొలిగించారో చెప్పాలని కమిషనర్‌ను ప్రశ్నించారు. కమిషనర్ సమాధానం ఇస్తూ అవుట్ సోర్సిగ్ ఉద్యోగిపై పలు ఫిర్యాదులు రావడంతో ఆమెను విధుల నుంచి తొలగించామని, ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని స్పష్టం చేశారు. దీంతో టీడీపీ కౌన్సిలర్లు గాలి జీవరత్నం నాయుడు, జాన్ కెన్నడి మాట్లాడుతూ అజెండా అంశాలను ప్రస్తావించకుండా, సభ సమయాన్ని వృథా చేయడం తగదని పేర్కొన్నారు. ఈ విషయంపై వైసీపీ, టీడీపీ కౌన్సిలర్లు మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. అజెండాలోని 2, 23, 24వ వార్డులకు సంబంధించిన అభివృద్ధి పనులను మాత్రమే ఆమోదించుకుని, సభను అర్ధాంతరంగా ముగించారు.

## వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా గాంధీ



వడమాలపేట, మే 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని కాయం గ్రామానికి చెందిన గాంధీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధిష్ఠానం శనివారం ఆదేశాలు జారీచేసింది. గాంధీకి ధారా ఉమాపతి, సుబ్రమణ్యం రెడ్డి, సురేష్ కుమార్, భరత్, చంద్రారెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.